తెలుగు దినపత్రిక

https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం


పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 159

మంగళవారం 11, నవంబర్ 2025


॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## జూబ్లీహిల్స్‌లో విచ్చలవిడిగా మద్యం..డబ్బుల పంపిణీ

- ఆధారాలతో ఇసికి ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్
- చర్యలు తీసుకోవాలన్న ఎమ్మెల్యే హరీష్ రావు



హైదరాబాద్,నవంబర్10 (అక్షర గళం): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇష్టారాజ్యంగా మద్యాన్ని ప్రవహింపజేస్తూ, విచ్చల విడిగా డబ్బులు పంపిణీ చేస్తుందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. లక్షకు పైగా చీరలు, మిక్సీ గ్రైండర్లను పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. వీటన్నింటికీ సంబంధించిన ఫొటోలు, వీడియో ఆధారాలను ఎలక్షన్ కమిషన్‌కు సమర్పించామని మిగతా..2లో



## విద్యారంగానికి పునాదులు వేసిన మౌలానా

- ఆజాద్ జయంతి సందర్భంగా స్మరించుకున్న రేవంత్



హైదరాబాద్,నవంబర్10(అక్షర గళం): భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేసి దేశ విద్యా రంగానికి పునాదులు వేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కే దక్కుతుందని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. మౌలానా జయంతి సందర్భంగా విద్యారంగ ప్రగతికి ఆయన చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. మహనీయుడి జయంతి రోజునే నవంబరు 11న జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా, వయోజన అక్షరాస్యత, సార్వత్రిక ప్రాథమిక విద్య, మిగతా..2లో

## అన్ని కోణాల్లో దర్యాప్తు సాగుతోంది

- ఎర్రకోట వద్ద జరిగిన పేలుగు ఘటన
- కేంద్రహోంమంత్రి అమిత్ షా వెల్లడి



న్యూఢిల్లీ,నవంబర్10(అక్షర గళం): ఎర్రకోట సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన భారీ పేలుడు ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వేగంగా స్పందించారు. ఈ ఘటనపై అన్ని కోణాల నుంచి దర్యాప్తు జరుప నున్నట్టు చెప్పారు. 'సాయంత్రం 7 గంటలకు పేలుడు జరిగింది. ఎర్రకోట సమీపంలోని సుభాష్ మార్గ్ ట్రాఫిక్స్ సిగ్నల్ వద్ద కారులో పేలుడు మిగతా..2లో

## మాయమైన మనిషి

## అందెశ్రీ

- తిరిగిరాని లోకాలకు వెళ్లిన తెలంగాణ గొంతుక
- అస్వస్థతతో తెల్లవారు జామున కన్నుమూత
- తెలంగాణ గొంతుకగా పాటలతో ఉత్తేజ పరిచిన స్వరం
- తెలంగాణ గీతంగా అందెశ్రీ జయ..జయహే తెలంగాణ
- తీవ్ర విచారం వ్యక్తం చేసిన రేవంత్, కెసిఆర్, చంద్రబాబు
- పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలకు ఆదేశం


హైదరాబాద్,నవంబర్10(అక్షర గళం): మనిషిన్నవాడు మాయమై పోయాడు. మానవ్వం ఉన్న చోటుకు తిరిగి రాకుండా పోయారు. పల్లె అన్నీ నేర్పిందన్న ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ కన్నుమూశారు. 64 ఏండ్ల అందెశ్రీ కొతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం రాత్రి లాలాగూడలోని తన నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయారు. మిగతా..2లో



## ఢిల్లీ సమీపంలో భారీగా ఆయుధాల స్వాధీనం

- 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాల స్వాధీనం
- హర్యానాతో కలసి కాశ్మీర్ పోలీసుల ఆపరేషన్
- పలువురు ఉగ్రవాదుల అరెస్ట్.. వారిలో నలుగురు డాక్టర్లు

న్యూఢిల్లీ,నవంబర్10(అక్షర గళం): దేశ రాజధాని ఢిల్లీ సమీపంలో ఉగ్రవాదులకు సంబంధించిన ఆయు ధాలు భారీఎత్తున లభ్యమయ్యాయి. మిగతా..2లో



# ఢిల్లీలో బాంబు పేలుడు

- రక్తం, మంటలతో ఎరుపెక్కిన ఎర్రకోట పరిసరాలు
- ఢిల్లీ నడిబొడ్డున కారుబాంబు పేలుడు

- 5 కార్లు పూర్తిగా ధ్వంసం, సమీపంలోని మరికొన్ని
- 13 మంది మృతి, మరో 10 మంది పరిస్థితి విషమం, 30 మందికి గాయాలు
- ఆ కారు బీహారీదేనన్న ఢిల్లీ పోలీసులు
- ఒకరి అరెస్టు, ఢిల్లీలో రెడ్ అలర్ట్
- ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన హెూంమంత్రి అమిత్‌షా
- రాత్రివరకూ పరిస్థితిని సమీక్షించిన అమిత్‌షా
- ప్రధాని మోదీ, రాహుల్, సీఎం చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, పవన్ కల్యాణ్, భట్టి, సత్యకుమార్‌యాదవ్, లోకేష్, కేటీఆర్ ఖండన
- మృతుల కుటుంబాలకు సంతాపం
- కేంద్రానికి బాసటడగా నిలవాలని పిలుపు
- హెూం మంత్రి అమిత్ షాతో మాట్లాడిన ప్రధాని మోదీ
- దేశమంతా రెడ్‌అలర్ట్

న్యూఢిల్లీ,నవంబర్10(అక్షర గళం): ఎర్రకోట పరిసరాలు.. సాయంత్రం వేళ బాంబు పేలుడు, అగ్నిజ్వాలలతో ఎర్రబారింది. బాధితుల ఆర్తనాదాలతో అట్టుడికిపోయింది. కాళ్లు తెగి, చేతులు కోల్పోయిన బాధితుల ఆర్తనాదాలు, హాహాకారాలతో ప్రతిధ్వనించాయి. బీహార్ రిజిస్ట్రేషన్ ఉన్న కారు ఒక్కసారిగా పేలడంతో ఎర్రకోట ప్రాంతం ఉలిక్కిపడింది. మిగతా..2లో





## ఢిల్లీ పేలుళ్ల ఘటనతో అలర్ట్

- హైదరాబాద్‌లో హైలర్ట్ ప్రకటించిన పోలీసులు

హైదరాబాద్,నవంబర్10(అక్షర గళం): ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడుతో దేశ రాజధాని దిల్లీలో అలజడి రేగింది. ఎర్రకోట మెట్రోస్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద కారులో పేలుడు సంభవించి.. 8 మంది మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. ఎర్రకోట పరిసర ప్రాంతాల్లో భీతావహ వాతావరణం నెలకొంది. దీంతో ఆ ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించారు. ఎన్ఐఏ బృందాలు రంగంలోకి దిగాయి. ఈ నేపథ్యంలో దిల్లీ సహా పలు నగరాలను కేంద్ర హోం శాఖ అప్రమత్తం చేసింది. ముంబయి, హైదరాబాద్, కోల్‌కతా, బెంగళూరు తదితర నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు,ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ముమ్మర తనిఖీలు సాగిస్తున్నారు. దిల్లీ పేలుళ్ల దృష్ట్యా నగరంలో అలర్ట్ ప్రకటించినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు.

## నేడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

- పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి
- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది
- డ్రోన్ల ద్వారా పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ

హైదరాబాద్,నవంబర్10(అక్షర గళం): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగనుంది.




జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో మొత్తం 4 లక్షల 1,365 మంది ఓటర్లు ఉన్నారు. 58 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఎన్నికల కోసం 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నాలుగు ఈవీఎంలను మిగతా..2లో

## గ్రూప్-2 అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

- నేటి నుంచి తెలుగువర్సిటీలో ప్రక్రియ

హైదరాబాద్,నవంబర్10(అక్షర గళం): గ్రూప్-3 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రా లను టీజీపీఎస్సీ పరిశీలించనుంది. మంగళ వారం నుంచి హైదరాబాద్ నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనుంది. ఈ ప్రక్రియ నవంబర్ 26 వరకు కొనసాగనుంది. మిగతా..2లో



## డీప్ ఫేక్ సమస్యలపై సిజెఐ ఆందోళన

అప్రమత్తంగా ఉండాలని న్యాయవాదులకు హెచ్చరిక

న్యూఢిల్లీ,నవంబర్10(అక్షర గళం): ఆధునిక సాంకేతిక యుగంలో చాలామంది డీప్‌ఫేక్ సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాయిస్ క్లోనింగ్, డీప్‌ఫేక్, చాట్‌బాట్ ఫిషింగ్ వంటి టూల్స్, యాప్స్‌ను ఉపయోగించి దీని ద్వారా సైబర్ నేరగాళ్లు తేలికగా మోసాలకు పాల్పడుతున్నారు. ఈ డీప్‌ఫేక్ ఫొటోలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ మిగతా..2లో



## బీహార్ నాడి ఎవరికి అనుకూలం..!

- తేజస్వీ పాచిక పారేనా
- ప్రశాంత్ కిశోర్ ప్రభావం చూపేనా
- నేటి పోలింగ్‌తో తీర్పు ఇవ్వనున్న బీహార్ జనతా

పాట్నా,నవంబర్10(అక్షర గళం): మూడున్నర దశాబ్దాల క్రితం మండల్ ఉద్యమంతో ప్రభవించిన నాయకద్వయం లాలూప్రసాద్ యాదవ్, నితీశ్‌కుమార్‌ల హవా దగ్గర పడుతోంది. బీహార్‌లోనూ రాజకీయాలు మారుతున్నాయి. లాలూ తనయుడు తేజ్వీ యాదవ్ సైతం రాజకీయాలను ప్రభావితం చేసే దశకు చేరుకున్నారు. ఒకప్పుడు లాలే, నితీశ్‌లు 'బ్రదర్స్ బిహారీ'గా సుప్రసిద్ధమయ్యారు. అయితే పరస్పరం పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వవ, భిన్నమైన రాజకీయ ఆలోచనలు వారిలో ఉండేవి. తొలి జనప్రియ నాయకుడుగా అధికార అందలాలు ఎక్కిన లాలూప్రసాద్ యాదవ్ అన్నిరకాల గడ్డి కరిచారు. దీంతో భార్య రబ్రీదేవిని గద్దెపై కూచోబెట్టారు. అద్వానీని అరెస్ట్ చేసి ప్రచారంలోకి వచ్చారు. అయితే గడ్డిదాణా కేసుతో పాటు, అనేక కేసుల్లో జైలుజవీవితం గడిపి మిగతా..2లో

## ఎర్రకోట వద్ద పేలుడు ఘటన

- ఆరా తీసిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,నవంబర్10(అక్షర గళం): ఎర్రకోట సమీపంలో చోటుచేసుకున్న పేలుడు ఘటనపై ప్రధాని మోదీ ఆరా తీశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. మరోవైపు, ఈ పేలుడు ఘటనకు సంబంధించిన వివరాలను దిల్లీ పోలీస్



కమిషనర్ వెల్లడించారు. సాయంత్రం 6.52 గంటలకు ఓ వాహనం ఎర్రకోట సమీపంలోని రెడ్ సిగ్నల్ వద్ద వచ్చి ఆగిందని, ఆ వెంటనే పేలుడు సంభవించిందని తెలిపారు. పేలుడు ధాటికి పలు వాహనాలకు మంటలు అంటుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో పలువురు మృతి చెందగా.. మరికొంత మంది గాయపడినట్లు చెప్పారు. దేశ రాజధాని నగరం దిల్లీలో ఎర్రకోట సమీపంలోని ఓ కారులో జరిగిన పేలుడు ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన దిల్లీ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడారు. పేలుడు ఘటన వివరాలను అమిత్ షాకు కమిషనర్ వివరించారు. మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌ను హోంమంత్రి ఆరా తీస్తున్నారు. మరోవైపు, ఈ ఘటన తీవ్ర బాధాకరమని కాంగ్రెస్ పేర్కొంది. దీనిపై సమగ్ర మైన, వేగవంతమైన దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా సంతాపం తెలిపారు.




## అత్యాధునికంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

- శంషాబాద్ విమానాశ్రయం తరహాలో ఆధునికీకరణ
- రూ.715 కోట్లతో రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు
- స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు ఏర్పాటు
- రైల్వేస్టేషన్ కోసమే ప్రత్యేకంగా 2 సబ్‌స్టేషన్ల నిర్మాణం
- ప్రత్యేకంగా 5 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటు ఏర్పాటు
- ఆధునీకరణ పనులను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,నవంబర్10(అక్షర గళం): శంషాబాద్ విమానాశ్రయం మాదిరిగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను తీర్చిదిద్దుతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో అధునాతనంగా రూపుదిద్దుకోబోఓతోందని అన్నారు. వచ్చే ఏడాది డిసెంబర్‌లోగా ఆధునీకరణ పూర్తవుతుందని అన్నారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను మిగతా..2లో

## గ్రూప్-2 అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరిశీలన జరుగనుందని టీజీపీఎస్సీ వెల్లడించింది. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు 2 జిరాక్స్ సెట్లు కూడా తమతోపాటు తీసుకురావాల్సి ఉంటుంది. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్ల జాబితాను టీజీపీఎస్సీ ఇప్పటికే లిలిలి.బిణూబఞ.ఐనీల.తిని వెబ్‌సైట్‌లో ఉంచింది. వెరిఫికేషన్‌కు ఏ రోజు, ఏ షెడ్యూల్‌లో హాజరు కావాలనే పూర్తి వివరాలను అందుబాటులో ఉంచినట్లు కమిషన్ కార్యదర్శి ప్రియాంక వెల్లడించారు. అభ్యర్థులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం హాజరు కావాలని సూచించారు. కాగా, కమిషన్ పేర్కొన్న తేదీలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకాని అభ్యర్థుల అభ్యర్థిత్వం తదుపరి ప్రక్రియకు పరిగణించబడదని స్పష్టం చేశారు. వెరిఫికేషన్‌కు హాజరైన వారికి సంబంధించి ఏవైనా పెండింగ్‌లో ఉన్న పత్రాలు ఉంటే, వాటిని నవంబర్ 29 (రిజర్వ్ డే) సాయంత్రం 5 గంటల తర్వాత అంగీకరించబడవని వెల్లడించారు.

## డీప్‌ఫేక్ సమస్యలపై సిజెఐ ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

సైతం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏఐ దుర్వినియోగం న్యాయవ్యవస్థపై కూడా పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎందరో న్యాయమూర్తులు, న్యాయవాదుల మార్ఫింగ్ చిత్రాలు కూడా తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఏఐ దుర్వినియోగం విషయంలో న్యాయవాదులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాధారణ ఏఐకి, జెన్ ఏఐకి మధ్య చాలా వ్యత్యాసముందని..జెన్ ఏఐని న్యాయవ్యవస్థలోకి వస్తే అది ఉనికిలో లేని చట్టాలను కూడా రూపొందిస్తుందని న్యాయవాది కార్తికేయ రావల్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీని వల్ల న్యాయ వ్యవస్థలో అస్పష్టత నెలకొంటుందని.. కాబట్టి న్యాయ సంస్థలలో జనరేటివ్ ఏఐ వినియోగాన్ని నియంత్రించడానికి మార్గదర్శకాలను రూపొందించేలా ఆదేశాలు జారీ చేయాలని సుప్రీం కోర్టును కోరారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ బి.ఆర్. గవాయ్ ధర్మాసనం సోషల్ మీడియాలో తమ డీప్ ఫేక్ ఫొటోలు కూడా ఉండడం చూసి ఆందోళనకు గురైనట్లు పేర్కొంది. ఈ కేసుపై విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఏఐ అనేది మనిషి మెదడు లాగా ఆలోచించి, నేర్చుకుని, సమస్యలు పరిష్కరించే టెక్నాలజీ. కానీ జనరేటివ్ ఏఐ కేవలం మనం అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడమే కాకుండా కొత్త విషయాలను సృష్టిస్తుంది. దానికి ఒక్క మాట చెప్పగానే ఎటువంటి సమాచారం ఇవ్వకపోయినా కథలు రాస్తుంది. ఫోటోలు, వీడియోలు రూపొందిస్తుంది. పాటలు కంపోజ్ చేస్తుంది. ఎటువంటి కొత్త విషయాలనైనా సొంతంగా సృష్టించ గలుగుతుంది.

## విద్యారంగానికి పునాదులు వేసిన మౌలానా

(మొదటి పేజీ తరువాయి)

14 సంవత్సరాల్లోపు బాలబాలికలందరికీ నిర్బంధ ఉచిత విద్య, వృత్తి శిక్షణలతో పాటు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటు వంటి విభిన్న విధానాలతో దేశంలో విద్యారంగాభివృద్ధికి ఆజాద్ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. మౌలానా ఆజాద్ స్ఫూర్తితో విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. అందులో భాగంగానే గ్రామీణ, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు వివరించారు. ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేశామని తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ఉపాధ్యాయులు, లెకర్చర్ల నియామకంతో రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పాటుపడుతున్నామని పేర్కొన్నారు. జాతీయోద్యమంలో పాల్గొనడంతో పాటు అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించారని సీఎం కొనియాడారు. ఖిలాఫత్ ఉద్యమములో పాల్గొని బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకముగా పోరాడారని గుర్తు చేశారు. జాతీయోద్యమములో హిందూ ముస్లిం ఐక్యతను కోరుకొని దేశ విభజనను వ్యతిరేకించాడని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం మైనారిటీలకు గొంతుకగా నిలిచారని పేర్కొన్నారు.

## నేడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేశారు. కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియం నుంచి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలింపు ప్రక్రియ మొదలైంది. సిబ్బందికి ఈవీఎంలు, పోలింగ్ సామాగ్రిని అధికారులు పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం కల్లా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు తరలించనున్నారు. 3 వేల మంది పోలింగ్ సిబ్బంది, 2 వేల మంది పోలీసులతో కలిపి మొత్తం 5 వేల మంది పోలీసులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విధుల్లో ఉన్నారు. మొత్తం 407 పోలింగ్ కేంద్రాల్లో 226 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. ఈసారి డ్రోన్ల ద్వారా పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ జరుగనుంది. 103 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో భద్రత కట్టుదిట్టం చేయనున్నారు. 45 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 230 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేశారు. ఎంసీసీ నిబంధనలు అతిక్రమించిన 27 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కాగా జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉపఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ నుంచి మాగంటి గోపినాథ్ భార్య మాగంటి సునీత బరిలో ఉండగా.. కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి పోటీలో ఉన్నారు. మూడు ప్రధాన పార్టీల నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఎలాగైనా ఉప ఎన్నికలో గెలవాలని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తీవ్రంగా కృషి చేశాయి. మరి జూబ్లీహిల్స్ ప్రజలు ఎవరికి పట్టం కట్టనున్నారో చూడాలి.

## అన్ని కోణాల్లో దర్యాప్తు సాగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

సంభవించింది. ఈ పేలుడులో పలువురు పాదచారులు గాయపడగా, కొన్ని వాహనాలు దెబ్బతిన్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం పలువురు ప్రాణాలు కోల్పోయారు. పేలుడు జరిగిన 10 నిమిషాల్లోనే ఢిల్లీ క్రైం బ్రాంచ్, ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ పోలీసు ఘటనా స్థలికి చేరుకున్నారు. ఎన్ఎస్జీ, ఎన్ఐఏ టీమ్‌లు, ఎఫ్ఎస్ఎల్ టీమ్‌లు కూలంకషంగా దర్యాప్తు జరుపుతున్నాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలు పరిశీలించాలని ఆదేశించాం. ఢిల్లీ సీపీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌చార్జ్‌తో మాట్లాడాను. వారిద్దరూ ఘటనా స్థలి వద్ద ఉన్నారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని సమగ్ర విచారణ జరుపుతాం. ఆ వివరాలను పబ్లిక్‌కు తెలియజేస్తాం. ఆసుపత్రికి స్వయంగా వెళ్లి క్షతగాత్రుల పరిస్థితిని తెలుసుకుంటాను' అని అమిత్‌షా తెలిపారు. ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో పేలుడు ఘటన పై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్ఎస్‌జీ, ఎన్ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించాలని ఆదేశించాం. ఢిల్లీ సీపీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌ఛార్జ్‌తో మాట్లాడాను. వారు ప్రస్తుతం ఘటనా స్థలంలో పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తాం. వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతాం అని అమిత్ షా తెలిపారు. అంతకుముందు ఈ ఘటనపై అమిత్ షా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడారు. పేలుడు ఘటన వివరాలను ఆయనకు కమిషనర్ వివరించారు. ఈ ఘటనకు సంబంధించి ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌కు కేంద్ర హోంమంత్రి ఆరా తీస్తున్నారు.

## జూబ్లీహిల్స్‌లో విచ్చలవిడిగా మద్యం..డబ్బుల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను కోరామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించి డబ్బులు పంపిణీ చేయడంపై హైదరాబాద్ బీఆర్ఎస్ భవన్‌లో సీఈవో సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. కొంతమంది పోలీసులు, ఇతర అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా మారిపోయారని విమర్శించారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. అధికార పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసినా జూబ్లీహిల్స్ ఓటర్లు తెలివైన వారు అని.. తగిన రీతిలో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని అన్నారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న అన్ని విషయాలను ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలను ఈసీకి అందజేసి.. ఆయా బూత్‌ల్లో కేంద్ర బలగాలను పెట్టాలని కోరామన్నారు. ముఖ్యంగా మహిళా పోలీసు అధికారులు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లను నియమించి, లోపలికి వెళ్లే ఓటర్ల ఐడెంటిటీని గుర్తించాలని.. ఆ తర్వాతే వారిని పోలింగ్ బూత్‌లోకి అనుమతించాలని కోరామని తెలిపారు. ఓటర్ ఐడీ గుర్తించకుండా ఓటర్లను పోలింగ్ బూత్‌కు పంపించకూడదని సూచించారు. మహిళా ఓటర్ల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని ఈసీని కోరామని హరీశ్‌రావు తెలిపారు. చాలావరకు ఫేక్ ఓటర్ ఐడీలను తయారుచేశారు.. దానికి సంబంధించిన వీడియోను ఎన్నికల ప్రధాన అధికారికి సమర్పించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగం, ఫేక్ ఐడీ కార్డుల వివరాలను ఎలక్షన్ అబ్జర్వర్లకు కూడా అందజేశామని పేర్కొన్నారు.

## ఢిల్లీలో బాంబు పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

ఆ ధాటికి సమీపంలోని 5 కార్లు పూర్తిగా ధ్వంసం కాగా, మరికొన్ని కార్లు ధ్వంసమయ్యాయి. ఆ పేలుళ్లకు భయపడిన పర్యాటకులు పరుగులు తీశారు. తాజా పరిణామాలతో అప్రమత్తమైన ఢిల్లీ పోలీసులు రెడ్ అలర్ట్ ప్రకటించారు.

ఘటనలో ఒకరిని అరెస్టు చేశారు. కాగా బాంబు పేలుడు వార్త తెలిసిన వెంటనే కేంద్రహోం మంత్రి అమిత్‌షా పోలీసులతో సమీక్ష నిర్వహించారు. సంఘటనా స్థలిని పరిశీలించిన ఆయన, ఆసుపత్రిలోని క్షతగాత్రులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ఎర్రకోట వద్ద జరిగిన బాంబు దాడిని ప్రధాని మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పెమ్మసాని సీఎం చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి మల్లు విక్రమార్క, కేంద్రమాజీ మంత్రి సుజనా చౌదరి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఏపీ మంత్రి నారా లోకేష్, సత్యకుమార్ యాదవ్, అనిత, అనగాని సత్యప్రసాద్, సుభాష్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఖండించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో ప్రజలు సంయమనం పాటించాలని, అన్ని పార్టీలు రాజకీయా లకు అతీతంగా ప్రభుత్వానికి అండగా



నిలవాలని పిలుపు నిచ్చారు. ఢిల్లీలో భారీ పేలుళ్ళు జరిగాయి. ఎర్రకోట మెట్రో స్టేషన్ గేట్ నెంబర్ 1 దగ్గర కారులో సోమవారం సాయంత్రం పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి ఐదు కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో పలువురికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం అందుతోంది. మరోవైపు పేలుడు కారణంగా పరిసరాల్లో ఉన్న కార్లకు మంటలు అంటుకోగా.. సమీపంలోని పలు దుకాణాలు ధ్వంసమయ్యాయి.

సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు హుటా హుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. 7 ఫైరింజన్ల సహాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఫోర్స్, ఫోరెన్సిక్ సిబ్బంది కూడా ఘటనా స్థలికి చేరుకుంది. పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సంఘటన స్థలంలో ఆధారాలను సేకరిస్తున్నారు.

పేలుడు జరిగిన ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. సిగ్నల్ వైపు నెమ్మదిగా కదులుతున్న ఒక వాహనంలో పేలుడు జరిగినట్లు ప్రత్యక్ష సాక్షి పోలీసులకు తెలిపారు. ఆత్మాహుతి దళాల ప్రమేయం ఉందని విశ్లేషకుల అంచనా వేస్తున్నారు. ఘటన జరిగిన 70 మీటర్ల దూరంలోనే గౌరీ శంకర్ ఆలయం ఉంది. సోమవారం కావడంతో ఆలయ సందర్శనకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో విధులు ముగించుకొని జనాలు ఇళ్లకు చేరే సమయంలో భారీ పేలుళ్లు జరిగాయి. దీంతో చాందినీ చౌక్, ఎర్రకోట పరిసరాల్లో విషాదచాయలు అలుముకున్నాయి.

అమిత్ షాతో ప్రధాని నరేంద్ర మోడీ సంభాషించారు. సంఘటన జరిగిన తీరుపై ఆరా తీశారు. దరియా గంజ్ నుంచి ఎర్రకోటవరకు వాహనాల రాకపోకలు నిలిపివేశారు. సాయంత్రం 6:55కు పేలుళ్లు సంభవించినట్లు ప్రాథమిక సమాచారం. పేలుళ్ల ధాటికి భూమి భారీగా కంపించిందంటున్నారు. పేలుళ్ల దెబ్బకు 6 కార్లకు మంటలు వ్యాపించాయి. నాలుగు ఆటో రిక్షాలు, 4 బైకులు దగ్ధమయ్యాయి. ఆసుపత్రికి తరలించేలోపే 8 మంది మృతి చెందారు. 30 మంది గాయపడ్డట్లు తెలుస్తోంది. మరో 10 మంది పరిస్థితి విషమం. సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు.

స్పాట్‌కు నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ చేరుకున్నారు. మీడియాతో సహా ఎవరినీ పేలుడు జరిగిన స్థలానికి పోలీసులు అనుమతించలేదు. క్షతగాత్రులను ఎల్ఎన్జేపీ లోకనాయక్ ఆసుపత్రికి తరలించారు. ఇదిలావుండగా, ఢిల్లీ పేలుళ్లతో ఉత్తర ప్రదేశ్, వాణిజ్య రాజధాని ముంబై మహానగరం పోలీసులు అప్రమత్తమయ్యారు. అయోధ్య రాం మందిర్ దగ్గర భద్రత కట్టుదిట్టం చేశారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## మాయమైన మనిషి

# అందెశ్రీ

(మొదటి పేజీ తరువాయి)

దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ' పాటను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గేయంగా గుర్తించింది. 1961, జూలై 18న ఉమ్మడి వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తిలో అంటే ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో ఉన్న రేబర్తిలో అందెశ్రీ జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లన్న. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేశారు. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. 'మాయమై పోతున్నడమ్మ మనిషన్నవాడు' అనే పాటతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అశు కవిత్వం చెప్పడంలో దిట్ట అయిన అందెశ్రీ.. ప్రజాకవి, ప్రకృతి కవిగా ప్రసిద్ధి చెందారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తన పాటలతో ప్రజలను ఉత్తేజితులను చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ'తోపాటు ఎన్నో పాటలు రాశారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 2006లో గంగ సినిమాకు నంది పురస్కారం అందుకున్నారు. 2014లో అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్, 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కరం, లోక్‌నాయక్ పురస్కారం అందుకున్నారు.అందెశ్రీ ఆకస్మిక మృతిపట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందన్నారు. అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేసుకున్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర గీతం కొత్త స్వరాలతో రూపకల్పన చేసుకున్నామన్నారు. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందంటూ సీఎం సంతాపం వ్యక్తం చేశారు. కవి,రచయిత అందెశ్రీ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని అన్నారు. తెలుగు సాహితీ లోకానికి ఇది తీరని లోటు అని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అందెశ్రీ మృతి పట్ల స్పీకర్ ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు సంతాపం వ్యక్తం చేశారు. అందెశ్రీ మృతి పట్ల భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతితి వ్యక్తం చేశారు. రాష్ట్ర సాధన సాంస్కృతిక ఉద్యమంలో అందెశ్రీ పాల్గొన్నారని గుర్తుచేశారు. తన పాటలతో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు అని పేర్కొన్నారు. అందెశ్రీ మృతిపట్ల భారత రాష్ట్ర సమితి నేతలు కేటీఆర్, హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. అందెశ్రీకి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరపాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

## బీహార్ నాడి ఎవరికి అనుకూలం..!

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం వయసుమీద పడడంతో ఇంటికే పరిమితం అయ్యారు. దీంతో ఇప్పుడు శారీరకంగా బలహీనుడయ్యారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేక పోయారు. పార్టీ బాధ్యతలను పూర్తిగా కుమారుడు తేజస్వి యాదవ్‌కు అప్పగించారు. తేజస్వి నవతరం నాయకుడుగా యువతో మంచి ఫాలోయింగ్ దక్కించుకున్నారు. అయితే తండ్రిలో ఉన్న జన సమ్మోహన శక్తి ఈ యువనేతలో కానరాదు. అనేక ఉచిత పథకాలకు తోడు కాంగ్రెస్ కూటమిలో ఉంటూ అధికార పగ్గాలు అందుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. 1970 దశకంలో జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో జరిగిన విద్యార్థి యువజన ఉద్యమం నుంచి పుట్టుకు వచ్చిన నాయకుడు నితీశ్‌కుమార్. ఆయనా ఇప్పుడు వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ ఇద్దరూ ఒకప్పుడు కలసి రాజకీయాలు చేశారు. తరవాత విడివడి ఎవరి దారి వారు చూసుకున్నారు. ఇకపోతే బిహార్ ప్రజలను ఆకట్టుకోగల సమర్థ నాయకత్వం బిహార్‌లో బీజేపీకి లేదు. దీంతో ఇక్కడ బిజెపి ఒంటరిగా అధికారం దక్కించుకునే పరిస్థితి లేదు. దీంతో నితీశ్ నీడ ఎదుగుతూ వస్తోంది. భారత జాతీయ కాంగ్రెస్ బీహార్‌లో పూర్తిగా తుడిచి పెట్టుకుపోయిందనే చెప్పాలి. ఇప్పుడు ఈ పార్టీ దాదాపు అచేతన స్థితిలో ఉన్నది. ఇక యువ నాయకుడు ప్రశాంత్ కిశోర్ బిహారీలను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. జన్ సురాజ్ పార్టీతో ఈ వ్యూహకర్త ఎలాంటి అలజడి సృష్టిస్తారా అన్నది చూడాలి. అయితే కులమే నిర్ణయాత్మక అంశంగా ఉన్న బిహార్ రాజకీయాలలో ఈ యువనేత జయపతాక ఎగురవేయ గలడా? సంప్రదాయ అధికార నిర్మాణాలు, సామాజిక నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఈ కొత్త నేత బిహార్ సమాజంలో మౌలిక మార్పులు తీసుకువస్తానని వాగ్దానం చేస్తున్నారు.ప్రజా జీవితంలో నైతిక విలువలకు నిబద్ధమైన నేతగా పేరుపొందిన నితీశ్‌కుమార్ ఇప్పుడు తన రాజకీయ మనుగడను కాపాడుకోవడంపైనే దృష్టి పెట్టారు. సైద్ధాంతిక విశ్వాసాల స్థానంలో అవకాశవాద రాజకీయాలు ప్రబలిపోయాయి. బిహార్‌లో సుదీర్ఘకాలంగా ముఖ్యమంత్రిగా ఉన్న నితీశ్ జోలికి ఏ విధంగానూ పోయేందుకు బీజేపీ సాహసించడంలేదు. బహిరంగంగాను, అంతర్గతంగాను సీనియర్ నాయకుడుగా ఆయన్ని గౌరవిస్తోంది. బిహార్‌లోని బీజేపీ శ్రేణుల్లో పాతకాలం నాటి అగ్రకులాల ఆధిపత్యం ఇప్పటికీ బలీయంగా ఉన్నది. 2015లో బీజేపీ బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో సొంతంగా అన్ని స్థానాలకూ పోటీ చేసింది. మోదీ హవా ఉధృతంగా ఉన్న ఆ కాలంలో కూడా బీజేపీ చెప్పుకోదగ్గ ఫలితాలు సాధించలేక పోయింది. 2024 సార్వత్రక ఎన్నికలలో సొంతంగా మెజారిటీ సాధించలేకపోవడంతో నితీశ్‌కుమార్‌ను బీజేపీ ఏమీ చేయలేకపోతోంది. సంకీర్ణ రాజకీయ ధర్మాన్ని అనుసరిస్తోంది. తనకు మద్దతు నిచ్చిన ప్రతి పార్టీ పట్ల సానుకూల వైఖరితో వ్యవహరించడాన్ని బీజేపీ అలవరచుకున్నది. 2029 సార్వత్రక ఎన్నికలకు ఇంకా వ్యవధి ఉన్నప్పటికీ ప్రస్తుత దశలో నితీశ్‌ను తొలగించడం శ్రేయస్కరం కాదని బీజేపీ భావిస్తోంది. మొత్తంగా ఇప్పుడు త్రిముఖ పోటీ జరుగుతోంది. మంగళవారం తుదిదశ ఎన్నికలు జరుగున్నాయి. ప్రజలు ఎవరిని ఆదరిస్తారో..ఎవరిని తిరస్కరిస్తారో 14న తేలనుంది.

## అత్యాధునికంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించిన అనంతరం.. మీడియాతో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను మెట్రో మార్గంతో అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. రూ.715 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు సాగుతున్నాయి. స్టేషన్‌ను 1.65 లక్షల చ.మీ మేర కొత్తగా నిర్మిస్తున్నాం. ఈ స్టేషన్‌కు నిత్యం 1.97లక్షల ప్రయాణికులు వస్తుంటారు. 2.70 లక్షల మంది ప్రయాణికుల అవసరాలకు తగినట్లు నిర్మిస్తున్నాం. నడుస్తున్న రైళ్లు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పనులు చేయాల్సి వస్తోంది. ఈ స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు ఉంటాయి. రైల్వేస్టేషన్ కోసమే ప్రత్యేకంగా 2 సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోందని కిషన్ రెడ్డి తెలిపారు. 5 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటు కూడా ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే ఏడాది డిసెంబర్‌లోపు ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆధునిక సికింద్రాబాద్ స్టేషన్‌ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాంఅని కిషన్‌రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పునర్నిర్మిస్తున్నట్లు కిషన్ రెడ్డి ప్రకటించారు. దక్షిణ భారత దేశంలోనే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక



ప్రాధాన్యత ఉందని ఆయన పేర్కొంటూ.. అమృత్ భారత్ పథకం కింద రూ. 714 కోట్లతో ఈ స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నామని, ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం 1,97,000 మంది ప్రయాణికులు రోజువారీగా ఈ స్టేషన్‌కు వస్తున్నారని, ప్రతి గంటకు సుమారు 23 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ.. పనుల వేగం తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నూతన నిర్మాణాలలో భాగంగా సౌత్ మెయిన్ బిల్డింగ్, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, ట్రావెలర్‌తో కూడిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయని ఆయన వెల్లడిం




చారు. సౌత్ సైడ్ బ్లాక్ నిర్మాణం రాబోయే నాలుగు నెలల్లో పూర్తి అవుతుందని, మొత్తం పునర్నిర్మాణ పనులను 13 నెలల్లో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ స్టేషన్‌ను 3 ఎకరాల విస్తీర్ణంలో 3 వేల మంది కూర్చునే విధంగా నిర్మిస్తున్నామని.. ఇది శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మాదిరిగా అత్యాధునికంగా ఉండనుందని ఆయన పేర్కొన్నారు. నవీకరించబడిన స్టేషన్‌లో 26 లిఫ్ట్‌లు, 32 ఎస్కలేటర్లు అందు బాటులోకి రానున్నాయి. అంతేకాకుండా, రెండు సబ్ స్టేషన్లు, అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ సిస్టమ్, 5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఎలాంట్, 5 లక్షల లీటర్ల సీవేజ్ ట్రీట్‌మెంట్ ఎలాంట్ వంటి సదుపాయాలు ఉండనున్నాయి. రోజుకు 2,70,000 మంది ప్రయాణికులు వచ్చినా సేవలు అందించేలా ఏర్పాట్లు జరుగు తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వివరించారు.

## ఢిల్లీ సమీపంలో భారీగా ఆయుధాల స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి)

హరియాణాలోని ఫరిదాబాద్‌లో 350 కిలోల అమ్మోనియం నైట్రేట్ సంబం ధిత పేలుడు పదార్థాలు, ఒక రైఫిల్ సహా 20 టైమర్లను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక పోలీస్ కమిషనర్ సతేందర్ కుమార్ గుప్తా వెల్లడించారు. ఉగ్రనిరోధక చర్యల్లో జమ్మూకశ్మీర్ పోలీసులు భారీ విజయం సాధించారు. హరి యాణా పోలీసులతో కలిసి నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ ఉగ్ర మాడ్యూల్ గుట్టురట్టు చేశారు. నిషేధిత జైషే మహమ్మద్, అన్సార్ ఘజ్‌వత్-ఉల్-హింద్ ఉగ్రసంస్థలతో సంబంధం ఉన్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఇందులో ముగ్గురు వైద్యులూ ఉన్నారు. ఈ క్రమంలోనే పెద్దఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రితోపాటు 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. జమ్మూకశ్మీర్ పోలీసు ప్రతినిధి వెల్లడించిన వివరాల ప్రకారం.. అక్టోబరు 19న శ్రీనగర్‌లోని బన్‌పొరా నౌగామ్ ప్రాంతంలో పోలీసులు, భద్రతాబలగాలను లక్ష్యంగా చేసుకుని.. జైషే మహ మ్మద్ పోస్టర్లు వెలిశాయి. ఈ వ్యవహారంపై ఉపా చట్టంతోపాటు ఆయా చట్టాల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఉగ్రవాద భావజాలం కలిగిన విద్యార్థులు, ప్రొఫెషనల్స్‌తో కూడిన ఓ ఉగ్రవ్యవస్థ వెలుగుచూసింది. ఈ బృందానికి పాకిస్థాన్, ఇతర దేశాల నుంచి పనిచేస్తున్న హ్యాండ్లర్లతో సంబంధాలున్నాయి. సామా జిక, ధార్మిక కార్యక్రమాల ముసుగులో అవసరమైన నిధులు సేకరించారు. వ్యక్తుల్లో తీవ్రవాద భావజాలాన్ని ప్రేరేపించి ఉగ్రసంస్థల్లో చేర్పించడం, లాజిస్టిక్స్ ఏర్పాటు, ఆయుధాలు, మందుగుండు సామగ్రితోపాటు ఐఈడీల తయారీకి అవసరమైన పదార్థాల సేకరణలో పాల్గొన్నట్లు గుర్తించాం. ఈ కార్యకలాపాల సమన్వయం కోసం నిందితులు ఎన్‌క్రిప్టెడ్ ఛానెళ్లను ఉపయోగించారని పోలీసు ప్రతినిధి వెల్లడించారు. ఉగ్ర పోస్టర్లు అంటించిన డాక్టర్‌ను విచారిస్తే భారీ ఆయుధ డంప్ వెలుగులోకి వచ్చింది. అరెస్టైన వైద్యుల్లో జమ్మూకశ్మీర్‌లోని కుల్గాంకు చెందిన డా.ఆదిల్, పుల్వామాకు చెందిన డా.ముజ మ్మిల్ అహ్మద్, లఖ్‌నవూకు చెందిన డా.షాహీన్ ఉన్నారు. హరియాణాలోని ఫరీదాబాద్‌లో డా.ముజమ్మిల్ అహ్మద్ అద్దె నివాసంలో పోలీసులు భారీ ఎత్తున పేలుడు పదార్థాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఇతడు అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో బోధకుడిగా పనిచేస్తున్నాడు. శ్రీనగర్‌లో జైషే మమహ్మద్ పోస్టర్లు వేసిన కేసులోనూ వాంటెడ్‌గా ఉన్నాడు. ఇతడిని అరెస్టు చేసినట్లు అంతకుముందు ఫరీదాబాద్ కమిషనర్ సతేందర్ కుమార్ గుప్తా వెల్లడించారు. మరోవైపు.. షాహీన్ కారులో ఓ ఏకే-47 రైఫిల్ లభ్యమైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా జమ్మూకశ్మీర్ లోని ఆయా ప్రాంతాలతో పాటు హరియాణాలోని ఫరీదాబాద్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహారన్‌పూర్‌లో స్థానిక పోలీసులతో కలిసి సోదాలు నిర్వహించాం. ఈ క్రమంలోనే మరికొంతమంది నిందితుల పాత్ర బయటపడింది. వారినీ అరెస్టు చేస్తాం. ఇప్పటివరకు ఓ చైనీస్ స్టార్, బెరెట్టా పిస్టల్స్, ఏకే 56, ఏకే క్రింకోవ్ రైఫిళ్లు, 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాలు స్వాధీనం చేసుకున్నాం. నిధులకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని జమ్మూకశ్మీర్ పోలీసు ప్రతినిధి తెలిపారు. వీటితో పాటు మూడు మ్యాగజైన్లు, పిస్టల్, వాకీటాకీ సెట్‌ను స్వాధీనపరచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. శ్రీనగర్‌లో అక్టోబర్ 27న జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రవాద సంస్థకు మద్దతుగా పలు పోస్టర్లు వెలిశాయి. వీటిని కశ్మీర్‌కు చెందిన వైద్యుడు ఆదిల్ అహ్మద్ రాథర్ వేసినట్టు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు పసిగట్టారు. సదరు వ్యక్తి ఉత్తర్ ప్రదేశ్ సహారాన్‌పుర్‌లోని ఓ ఆస్పత్రిలో వైద్యుడిగా సేవలందిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అతణ్ని గతవారం అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. నిందితుడు గతేడాది అక్టోబర్ ముందువరకూ అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విధులు నిర్వర్తించాడని, అక్కడ అతని లాకర్‌ను తనిఖీ చేయగా ఒక రైఫిల్ దొరికిందని తెలిపారు. అతను ఇచ్చిన సమాచారం ప్రకారమే ఫరిదాబాద్‌లో ఈ రికవరీ జరిగినట్టు వెల్లడించారు. నిందితుడు రాథర్ చెప్పిన ప్రకారం.. ముజామ్మిల్ షకీల్ అనే మరో డాక్టర్ వద్ద కూడా పేలుడు పదార్థాలు, ఆయుధ సామాగ్రి నిల్వ ఉన్నట్టు తేలింది. దీంతో పుల్వామాకు చెందిన షీకల్‌నూ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతడు ఫరిదాబాద్‌లోని ఆల్-ఫలాహ్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. ఈ ఘటనకు సంబంధించి ఓ మహిళా వైద్యురాలి కారులో ఒక రైఫిల్, పిస్టల్ బయటపడ్డాయి. ఆమె మందుగుండు సామాగ్రిని నిల్వచేసేందుకు వినియోగించిన కారును స్వాధీనం చేసుకున్న దర్యాప్తు అధికారులు.. ఆమెపై విచారణ చేపట్టారు.



తెలుగు దినపత్రిక https://aksharagalam.com

అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

తెలంగాణ రౌండప్


# సాయి బాబు కుటుంబాన్ని ఆదుకుంటాం



**ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్, నవంబర్ 10, (అక్షర గళం):** ఉప్పల్‌లోని ఇందిరా నగర్‌కు చెందిన వెల్దండ సాయి బాబు మూడు రోజుల క్రితం గుండె పోటుతో మృతి చెందారు. సాయి బాబుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సోమవారం సాయి బాబు కుటుంబాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించారు. కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. చిన్న వయసులోనే సాయి బాబు మృతి చెందడం చాలా బాధాకరంగా ఉందని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి అన్నారు. సాయి బాబు కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అంద చేశారు. ముగ్గురు పిల్లలను తన సొంత ఖర్చులతో చదివిస్తానన్నారు. ఈ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాకారం లక్ష్మణ్, లింగంపల్లి రామకృష్ణ, తోకట రాజు, మద్దూరి కుమార్, గంజాయి ప్రకాష్, ఎల్దండా రాజు, దప్పు నందు, ఒక్కస్ నరేందర్, అలుగుల అనీల్ కుమార్, మండల నాగరాజు, జాజర్ల సాయికుమార్, తోకట రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వానరానికి అంత్యక్రియలు

**ఆమనగల్లు, నవంబర్ 10 (అక్షర గళం):**
ఆమనగల్లు పట్టణంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన వానరానికి అంతరింతుర కొండ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం కమిటీ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. సోమవారం ఉదయం పట్టణంలోని ఆలయం ముందు ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వానరం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు హిందూ సాంప్రదాయ పద్ధతిలో దానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హనుమాన్ వర్గానికి చెందిన వానరం మృతి చెందడంతో గ్రామ యువకుల సహకారంతో హిందూ సంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దుడ్డు ఆంజనేయులు, పబ్బు పరమేష్ గౌడ్, గోపాల కృష్ణ, దుడ్డు మల్లేష్ తదితరులు ఉన్నారు.



# అందెశ్రీ మృతి బాధాకరం

**- అభినవ్ రెడ్డి**

**ఆమనగల్లు, నవంబర్ 10 (అక్షర గళం):** ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ సోమవారం ఉదయం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. అందెశ్రీ భౌతిక కాయాన్ని అభిమానుల సందర్శనార్థం లాలాపేట్ జయశంకర్ స్టేడియానికి తరలించారు. ఆయన మృతదేహానికి ఆమనగల్లు మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్



నివాళులర్పిస్తున్న అభినవ్ రెడ్డి

జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జీ దారెడ్డి అభినవ్ రెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం అందెశ్రీ కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అందెశ్రీ అకాల మరణం తీవ్ర బాధాకరమని, తెలంగాణ ఉద్యమం, సాంస్కృతిక పోరాటంలో ఆయన పోషించిన పాత్రను అభినవ్ రెడ్డి గుర్తు చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# దేశ భవిష్యత్ తరగతి గదుల్లో నిర్మితమవుతుంది

**- యువ నాయకుడు రాకేష్**

**ఆమనగల్లు, నవంబర్ 10 (అక్షర గళం):** దేశ భవిష్యత్ తరగతి గదుల్లో నిర్మితమవుతుందని యువజన కాంగ్రెస్ నాయకుడు కాలే రాకేష్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని సోమవారం పట్టణ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల 80 మంది విద్యార్థులకు కాలే రాకేష్ తన సొంత డబ్బులతో నోట్



బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. విద్య ద్వారానే సమాజంలో ఉన్నత విలువ, గౌరవం సాధ్యమవుతుందని, సమాజంలో పేదరికం అసమానతలు తొలగిపోవడానికి విద్య ఎంతో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర నాయకులు గుండ్రాతి కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ దేవరశెట్టి మహేష్, యువజన నాయకులు వెంకటేష్, సురేష్, లండం గణేష్, అమెర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇక్బాల్ కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీఆర్

**మీర్ పేట, నవంబర్ 10, (అక్షర గళం):** మీర్‌పేట హెచ్చీ కాలనీ డివిజన్ డైమండ్ హిల్స్ కాలనీ చెందిన కాంగ్రెస్ నాయకుడు ఇక్బాల్ తల్లి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి సోమవారం ఇక్బాల్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్చీ కాలనీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, కాశెట్టి ప్రసాద్, విట్టల్ నాయక్, అజ్జీద్, కిషోర్, సురేష్ గౌడ్, అలీమ్, సమ్మయ్య, జెమిని, శివ, రాజేష్, శ్రీను, ముర్తజా పాల్గొన్నారు.







# రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగకుండా ఉంటే చర్యలు తప్పవు

**- బాలానగర్ ఇంచార్జ్ డీసీపీ కోటి రెడ్డి**

**కుత్బుల్లాపూర్, నవంబర్ 10 , (అక్షర గళం):** రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగకుండా ఉంటే చర్యలు తప్పవని బాలానగర్ ఇంచార్జ్ డీసీపీ కోటి రెడ్డి హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇటీవల జగద్గిరిగుట్టలో రౌడీషీటర్ దారుణ హత్య దృశ్య సైబరాబాద్ సిపి అవినాష్ మొహంతి ఆదేశాల మేరకు నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా బాలానగర్ ఇంచార్జ్ డీసీపీ కోటి రెడ్డి, బాలానగర్ డివిజన్ పరిధిలోని సుమారు 20 మంది యాక్టీవ్ రౌడీ షీటర్లకు బాలానగర్ ఏసీపీ కార్యాలయంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలానగర్ ఇంచార్జ్ డీసీపీ కోటి రెడ్డి మాట్లాడుతూ రౌడీ షీటర్లు అల్లర్లు, అలజడులకు పాల్పడితే సిపి అవినాష్ మొహంతి సూచనల మేరకు చట్టపరమైన చర్యలు నగర బహిష్కరణ, పీడీ యాక్ట్ నమోదు చేయటంతో



పాటు, బైండోవర్ చేయనున్నట్టు, పాత నేరాలలో పొందిన బెయిల్ ను రద్దుచేయనున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మంచి ప్రవర్తనతో ఉంటే కుటుంబాలు సంతోషంగా ఉంటాయని, దానితో పాటు సమాజంలో గుర్తింపు పెరుగుతుందని సూచించారు. రౌడీ షీటర్లు అల్లర్లు, అలజడులకు, నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. చెడు నడత కలిగిన రౌడీ షీటర్లపై పోలీసు నిఘా ఉంటుందన్నారు.

రౌడీ షీటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరూ సంబంధిత స్టేషన్లలో సంతకాలు చేస్తూ ఉండాలన్నారు. బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్టేషన్ అధికారి అనుమతి తప్పని సరిగా తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై ఏదైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా 20 మంది రౌడీ షీటర్లను డీసీపీ కోటి రెడ్డి ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. అనంతరం బాండ్ పేపర్‌పై రౌడీ షీటర్ల చట్ట వ్యతిరేక పనులు చర్యలు చేపట్టబోమని లిఖిత పూర్వకంగా హామీ తీసుకొని, రు.2 లక్షల సొంతపూచి కత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, జగద్గిరిగుట్ట సీఐ వెంకటేశం, జీడిమెట్ల డిఎస్ఐ శ్యామ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# 12క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయాలి

**ఏడు క్వింటాళ్ల పత్తి కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలి**

**బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యనాయక్**

**ఆమనగల్లు, నవంబర్ 10 (అక్షర గళం):** పత్తి రైతుల నుండి ఏడు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామనే పరిమితిని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేయాలని బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు పత్యనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని ఆకుతోటపల్లి సమీపంలోని ఎన్.డి.టి కాటన్ ఇండస్ట్రీస్ మిల్లులో స్థానిక నాయకులతో కలిసి పత్యనాయక్ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రతి రైతు నుండి 12 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయాల్సి ఉండగా సిసిఐ కేంద్రాలు ఏడు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడం సరైనది కాదన్నారు. కాపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుకింగ్ 7 క్వింటాళ్లకు పరిమితం చేశారని, మరి మిగతా పంటను ఎవరు కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. దళారుల దోపిడీకి రైతులను బలి చేయడానికే ఇటువంటి పద్ధతులు అనుసరిస్తున్నారని విమర్శించారు. మరోవైపు తేమ శాతం ఎక్కువ ఉందనే పేరుతో రైతుల నుండిపత్తిని సేకరించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల నుండి పూర్తిస్థాయిలో పత్తిని కొనుగోలు చేయకుండా, ఇదే సమయంలో పత్తి దిగుమతులపై సుంకాలను ఎత్తివేయడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. విదేశాల నుండి దిగుమతులను ప్రోత్సహిస్తే దేశంలోని స్వదేశీ రైతులు గిట్టుబాటు ధర రాక ఇబ్బందుల పాలవుతారన్న విషయం కేంద్ర ప్రభుత్వానికి తెలియదా అన్నారు. స్వదేశీ రైతుల పొట్ట కొట్టి విదేశీయులుకు



12క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయాలని వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఎర్ర తివాచి పరచడమే దేశభక్తా అని నిలదీశారు. ప్రతి రైతు దగ్గర 12 క్వింటాళ్లు కొనుగోలు చేసే విధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో రైతులను కలుపుకొని ఆందోళనలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్, మాజీ ఎంపిటిసి సరిత పంతు నాయక్, యూత్ వింగ్ అధ్యక్షుడు దేరంగుల వెంకటేష్, మాజీ డైరెక్టర్ రమేష్ నాయక్, నాయకులు గన్యా నాయక్, రమేష్ నాయక్, లండం యాదయ్య, రంగయ్య, వరికుప్పల గణేష్, మహేష్ నేత, పంతు నాయక్, సొమ్ల నాయక్, నరేందర్ రెడ్డి, వెంకటయ్య, మహేష్, గణేష్ నాయక్ మరియు రైతులు రాములు, రాజు, జంగమ్మ, అలివేలు, లక్ష్మీ, కృష్ణయ్య, శివ, మల్లేష్ తదితరులు ఉన్నారు.

# నవంబర్ నెల పంటల సేకరణకు కీలకం : కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి


**మంత్రులు ఉత్తమ్, తుమ్మల, సీఎస్ రామకృష్ణారావులు**

**హైదరాబాద్, నవంబర్ 10, (అక్షర గళం):** నవంబర్ నెల పంటల సేకరణకు కీలకమని జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మంత్రులు ఉత్తమ్, తుమ్మల, సీఎస్ రామక్రిష్ణారావులు అన్నారు. ధాన్యం సేకరణ, పత్తి, మొక్కజొన్న, సోయాచిక్కుడు కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో మంత్రులు ఉత్తమ్, తుమ్మల , సీఎస్ రామక్రిష్ణారావులు సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో జరిగిన సమీక్షలో పత్తి మొక్కజొన్న సోయా చిక్కుడు కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ల అభిప్రాయాలు తెలుసుకున్నారు. మొక్కజొన్న కొనుగోలులో ఎకరాకు 18.5 క్వింటాలు నుంచి 25 క్వింటాళ్ల వరకు పరిమితి పెంచడం వల్ల రైతులు సంతోషంగా ఉన్నారని జిల్లా కలెక్టర్లు మంత్రి తుమ్మలకు తెలి





పారు. పత్తి కొనుగోలులో ఎల్1 ఎల్2 నిబంధనలు వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్లు మంత్రి తుమ్మల కి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎకరాకు 7 క్వింటాలు పత్తి మాత్రమే కొనుగోలు చేయాలని సీసీఐ నిబంధన ఎత్తివేసి 12 క్వింటాలు కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం మీద రాష్ట్ర



ప్రభుత్వం ఒత్తిడి తెస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. వర్షాలవల్ల రంగుమారిన సోయాచిక్కుడు కొనుగోలు చేయాలని కేంద్రానికి ప్రతిపాదన పంపినట్లు జిల్లా కలెక్టర్లకు తెలిపారు. పంటల సేకరణకు ఈ నవంబర్ నెల కీలకమని జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు.

# రచయిత అందెశ్రీ అంత్యక్రియలను రాష్ట్ర ప్రభుత్వం లాఛనంగా నిర్వహించనుంది

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**మేడ్చల్ ప్రతినిధి , నవంబర్ 10, (అక్షర గళం):**
తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ రచయిత అందెశ్రీ అంత్య క్రియలను రాష్ట్ర ప్రభుత్వం లాఛనంగా నిర్వహించనున్నట్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. ఘట్కేసర్ లోని ఎంఎల్ఎ క్యాంపు ఆఫీస్ ప్రక్కన అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తాతో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందెశ్రీ అంత్యక్రియలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు అన్నీ శాఖలు సమన్వయంతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రముఖులు రావడానికి సరైన విధంగా రహదారి ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడ ఎటువంటి లోపాలు లేకుండా





ఏర్పాట్లు నిర్వహించాలని అంతే కాకుండా ఎన్ఎఫ్‌సి కాలనీలోని అందెశ్రీ ఇంటి వద్ద కూడా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తహసీల్దారు, మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. పోలీసు శాఖ వారు బందోబస్తు, ఆర్ అండ్ బి వారు కావలసిన నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు.



# కొనసాగుతున్న పశువైద్య శిబిరాలు

వెల్దండ నవంబర్ 10 (అక్షర గళం): వెల్దండ మండల పరిధిలోని బర్కత్ పల్లి అంకమోనికుంట గ్రామాలలో పశువులకు ఉచిత గాలి కుంట వ్యాధి నివారిణి టీకాలు వేస్తున్నట్లు పశువైద్య అధికారి శ్యాంసుందర్ తెలిపారు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించి వ్యాధి బారిన పడకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు కావున



రైతులందరూ పశువులకు టీకాలు తప్పక వేయించాలని అన్నారు ఈ కార్యక్రమంలో వెల్దండ పశు వైద్య సిబ్బంది నరేష్ రెడ్డి నరసింహ ఫణిందర్ రెడ్డి శ్రీను తిరుపతయ్య గోపాలమిత్రలు మొగులయ్య సాయిబాబు బాలు విజేందర్ రైతులు వెంకటయ్య ప్రకాష్ మధు తదితరులు పాల్గొన్నారు

## ఉప్పల్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించేలా కృషి

**కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి**

ఉప్పల్, నవంబర్ 10, (అక్షర గళం): ఉప్పల్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తానని కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం న్యూ విజయపురి కాలనీలో రూ.కోటి 80 లక్షలతోజరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు.



ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఉప్పల్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. డివిజన్ లోని అన్ని కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మాణాలను చేస్తున్నట్టుగా ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. న్యూ విజయపురి కాలనీలో తొందరలోనే కొత్త మంచినీటి పైపు లైన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉప్పల్ డివిజన్ ను సమస్యలు లేని డివిజన్ గా, ఆదర్శ డివిజన్ గా తీర్చి దిద్దుతున్నట్టుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజ్ కుమార్,కాలనీ అధ్యక్షులు వెంకటేశ్,తెల్కల మోహన్ రెడ్డి,నాగి రెడ్డి, పబ్బు నర్సింహ, సల్ల ప్రభాకర్ రెడ్డి,వర్కాల మదన్ గౌడ్, పాపయ్య,శంకరయ్య,పూస సతీష్,భాస్కర్,దానయ్య,నర్సింహ కురుమ,వెంకటేశ్వర రావు,పద్మ సుమిత్ర సావిత్రి అండాలు తదితరులు పాల్గొన్నారు

## బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

**- సీడీపీఓ శాంతి రేఖ**

ఆమనగల్లు, నవంబర్ 10 (అక్షర గళం): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ శాంతి రేఖ స్పష్టం చేశారు. పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నషాముక్త్ భారత్ అభియాన్ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సమాజంలో బాల్య వివాహాల నిర్మూలన సామాజిక బాధ్యత అని చెప్పారు. బాల్య వివాహం జరిపిస్తే బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు వివిధ ఒత్తిళ్ల కారణంగా డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని, మత్తు పదార్థం మానసికంగా, శారీరకంగా తీవ్ర




నష్టం చేస్తుందని తెలిపారు. ఒత్తిళ్లను అధిగమించేందుకు స్నేహితులతో మాట్లాడడం, పుస్తకాలు చదవడం, సామాజిక సేవ వంటి అనేక మార్గాలు ఉన్నాయని సూచించారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, ఎఎస్ఐ రామ్ రెడ్డి, సూపర్వైజర్ అనిత, అంగన్వాడి టీచర్స్ రజిత, ధనలక్ష్మి మరియు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.కోటి చెల్లించండి!

**- నార్కట్ పల్లి కామినేని హాస్పిటల్ యాజమాన్యానికి బిగ్ షాక్**

**- నల్గొండ జిల్లా వినియోగదారుల ఫోరమ్ సంచలన తీర్పు**

నల్గొండ (అక్షర గళం): నార్కట్‌పల్లి కామినేని హాస్పిటల్ యాజమాన్యానికి బిగ్ షాక్ తగిలింది. ఓ మహిళకు నిర్లక్ష్యంగా వైద్యం చేసి.. ఆమె ప్రాణాన్ని బలిగొన్న కేసులో నల్గొండ జిల్లా వినియోగదారుల ఫోరమ్ సంచలన తీర్పు వెలువరించింది. బాధిత కుటుంబానికి "కోటి" రూపాయల పరిహారం ఇవ్వాలంటూ ఆదేశించింది. నెలరోజుల్లోగా ఆ డబ్బులు చెల్లించకపోతే 9% వడ్డీ తో ఇవ్వాల్సి ఉంటుందన్న ఫోరమ్ హెచ్చరించింది.



నల్గొండ జిల్లా చిట్యాల (మం) ఆరెగూడెం గ్రామానికి చెందిన అస్నాల స్వాతిని 2018 జూలై 9 న డెలివరీ కోసం కామినేని ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. జూలై 13 రాత్రి ఆమెకు కామినేని వైద్యులు సర్జరీ చేశారు.

రెండు సార్లు మత్తు మందు ఇవ్వడంతో వైద్యం వికటించింది. 14 వ తేదీన వైద్యుల నిర్లక్ష్యంతో స్వాతి మృతి చెందింది. చనిపోయిన తరువాత మూవీ ఆర్టిస్ట్ లను వైద్యులు మించిపోయారు. ఠాగూర్ సినిమా రేంజ్ లో యాక్టింగ్ చేశారని బాధితులు తెలిపారు. బాధితుల తరపున కేసు ప్రముఖ న్యాయవాది మేరెడ్డి నర్సింహా రెడ్డి వాదించారు.





# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మను చౌదరి**

మేడ్చల్ ప్రతినిధి, నవంబర్ 10,(అక్షర గళం): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మను చౌదరి అన్నారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ లతో కలిసి ఆయన109 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజలు వారి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఎంతో నమ్మకంతో మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్‌లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 'అక్షరా'న్ని వీడి అనంతలోకాలకు...

**ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ ఇకలేరు!**

హైదరాబాద్: ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ(64) కన్ను మూశారు. ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోయిన ఆయనను కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అందెశ్రీ ఈలోకాన్ని విడిచారు. అందెశ్రీ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఇందుకు 2025 జూన్ రెండోతేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా రూ.కోటి నగదు పురస్కారాన్ని అందుకున్నాడు.

### తొలినాళ్ళు

ప్రజాకవి, ప్రకృతి కవిగా సుప్రసిద్ధులైన డాక్టర్ అందెశ్రీ వరంగల్ జిల్లా, జనగాం వద్ద గల రేబర్తి (మద్దూర్ మండలం) అనే గ్రామంలో జన్మించారు. ఈయన అసలు పేరు అందె ఎల్లయ్య. ఈయన ఒక అనాథగా పెరిగారు. ఏ విధమైన చదువు చదవులేదు. కాకతీయ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పొందారు. ఈయన గొడ్ల కాపరిగా పనిచేశారు. శృంగేరి మఠానికి చెందిన స్వామి శంకర్ మహారాజ్ ఇతను పాడుతుండగా విని ఇతడిని చేరదీశాడు.

రాష్ట్రవ్యాప్తంగా ఈయన పాటలు ఆదరణ పొందాయి. నారాయణ మూర్తి ద్వారా వచ్చిన విప్లవాత్మక సినిమాల విజయం వెనుక ఈ పాటలున్నాయి. తెలంగాణ, ప్రకృతి లాంటి అంశాలపై ఈయన గేయరచన చేశారు. ఈయన అశువు కవిత్వం



చెప్పటంలో దిట్ట. 2006లో గంగ సినిమాకు నంది పురస్కారాన్ని అందుకున్నారు. ఈయన తెలంగాణ మాతృగీతం రచించారు.

సినీ సంభాషణలు: బతుకమ్మ సినిమా కోసం ఈయన సంభాషణలు కూడా రాసారు.

### సినీ పాటల జాబితా

జయజయహే తెలంగాణ జననీ జయకేతనం(తెలంగాణ మాతృగీతం), పల్లెనీకు వందనములమ్మో, మాయమై పోతున్న డమ్మో మాయమై పోతున్నాడమ్మా మనిషన్నవాడు, గలగల గజ్జెలబండి, కొమ్మ చెక్కితే బొమ్మరా.. జన జాతరలో మన గీతం, యెల్లిపోతున్నావా తల్లి, చూడ చక్కని ఆవారాగాడు (సినిమా).

### పురస్కారాలు, గుర్తింపులు

2014లో తెలంగాణ ప్రభుత్వం ఈయనను భారత అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీకు ప్రతిపాదించింది. ఎర్ర సముద్రం సినిమా కోసం రచించిన 'మాయమైపోతుండమ్మా మనిషన్నవాడు' ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాల తెలుగు రెండో సంవత్సరం సిలబస్‌లో చేర్చారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఈయనకు గౌరవ డాక్టరేట్ అందించింది. అకాడమి ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్, వాషింగ్ టన్ డి.సి వారి గౌరవ డాక్టరేట్ తోపాటు లోకకవి అన్న బిరుదునిచ్చి 2014 ఫిబ్రవరి 1లో సన్మానించింది. వంశీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారిచే దాశరథి సాహితీ పురస్కారం (2015 ఆగస్టు 14). డాక్టర్ రావూరి భరద్వాజ, రావూరి కాంతమ్మ ట్రస్ట్ వారిచే జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం(2015 జూలై 5). నంది పురస్కారం కూడా అందుకున్నారు.


మలిదశ తెలంగాణ ఉద్యమంలో కవిగా మహోన్నతమైన పాత్రను నిర్వర్తించాడు. అంతేకాకుండా తెలంగాణ ధూంధాం కార్యక్రమ రూపశిల్పిగా తెలంగాణ జిల్లాల్లోని ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని కలిగించాడు. అందెశ్రీ రచించిన జయజయహే తెలంగాణ గీతాన్ని తెలంగాణ ప్రజలు ముక్కోటి గొంతుకలతో... ఇప్పటికి విద్యాసంస్థలలో, ఇతర ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యక్రమాలలో తెలంగాణ జాతి గీతంగా, ప్రార్థనాగీతంగా పాడుకోవడం విశేషం.

సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కారం, సుందరయ్య విజ్ఞాన కేంద్రం (2022 అక్టోబరు 15) దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారం-2024, లోక్ నాయక్ పురస్కారం వరించింది.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

హైదరాబాద్, (అక్షర గళం):

ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ ఆకస్మిక మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణను



రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర సాధనలో జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందని గుర్తు చేశారు.

అందె శ్రీతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర గీతం కొత్త స్వరాలతో రూపకల్పన చేసుకున్నామని, అందెశ్రీతో కలిసి పంచుకున్న ఆలోచనలు, ఆయనతో తనకున్న అనుబంధాన్ని సీఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందంటూ... ఆయన మరణం పట్ల ముఖ్యమంత్రి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు.

స్వరాష్ట్ర సాధనలో, జాతిని జాగృతం చేయడంలో ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు.


అందెశ్రీ కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

## సాహితీ వనంలో మహా వటవృక్షం కూలింది...

**- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

హైదరాబాద్, (అక్షర గళం):

తెలంగాణ రాష్ట్ర గీతమైన జయజయహే తెలంగాణ రచయిత అందెశ్రీ ఆకస్మిక మృతి పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతి లోనయ్యారు. అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని ఆయన అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన రచించిన జయజయహే తెలంగాణ గీతం జాతి గొంతుకై.. అందరిని ఒక్కతాటి మీదకు తీసుకువచ్చిందన్నారు.



తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆయన చేసిన సాహితీ కృషి చరిత్ర ఉన్నంతత వరకూ నిలిచిపోతుందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆయన రచించిన జయజయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించిన రోజున ఆయన ఎంతో ఉద్విగ్నతకు లోనైన విషయాన్ని భట్టి విక్రమార్క గుర్తు చేసుకున్నారు. అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. ఆయనతో కలిసి పంచుకున్న దార్శనిక ఆలోచనలు అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాలన్న తపనను ఉప ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు.

తెలంగాణ రాష్ట్ర సాహితీవనంలో నిటారుగా ఎదిగిన మహా వటవృక్షం నేలకూలిట్లుగా ఆయన మరణం ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన సంతాపాన్ని ప్రకటించారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

## అందెశ్రీ మరణం పట్ల కేసీఆర్ సంతాపం

హైదరాబాద్, (అక్షర గళం):

ప్రముఖ కవి, 'జయ జయ హే తెలంగాణ..' ఉద్యమ గీత రచయిత, డాక్టర్ అందెశ్రీ మరణం పట్ల తెలంగాణ తొలి



ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వారి మరణం పట్ల విచారం తెలుపుతూ తన సంతాపం ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో, కవిగా తన పాటలతో, సాహిత్యంతో, కీలక పాత్ర పోషించిన అందెశ్రీ మరణం తెలంగాణకు తీరనిలోటని కేసీఆర్ అన్నారు. ఉద్యమ కాలంలో అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ ఈ సందర్భంగాస్మరించుకున్నారు. అందెశ్రీ మరణంతో శోకతప్త హృదయులైన కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

దివంగత అందెశ్రీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కేసీఆర్ ప్రార్థించారు.

# అందెశ్రీని హత్తుకున్న అమెరికా!

**- ప్రవాసులతో ప్రత్యేక అనుబంధం**

**- మాట, పాటలతో ప్రపంచ యాత్ర చేసిన స్వాప్నికుడు**

**- అమెజాన్ నది పుట్టన చోటికి వెళ్లి నది లోక నిధి కావ్యరచన**

**- అందెశ్రీ అకాలమరణంపై నైటా ప్రెసిడెంట్ వాణి ఏనుగు తీవ్ర సంతాపం**


న్యూయార్క్: ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ అకాల మరణంపై ప్రవాస తెలంగాణ వాసులు తీవ్ర సంతాపం తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనే ఆయనకు అనేక మంది ఎన్.ఆర్.ఐలతో పరిచయాలు పెరిగాయి. ఉద్యమ స్ఫూర్తి, భావజాల వ్యాప్తిలో భాగంగా అనేక దేశాల ప్రవాసులు ఆయనను స్వయంగా ఆయాదేశాలకు ఆహ్వానించి, ఆతిథ్యం ఇచ్చారు. వీరులో అమెరికాలో ప్రముఖ ప్రవాస వ్యాపారవేత్త పైళ్ల మల్లారెడ్డి, ఏనుగు లక్ష్మణ్ దంపతులు మొదటి వారు.

2009 మొదలు అనేక సార్లు అందెశ్రీ అమెరికా వెళ్లారు. ఏమాత్రం ఇంగ్లీషు భాష పరిచయం లేకపోయినా ఆయన అనేక దేశాలు చుట్టొచ్చారు. భావం ఉంటే చాలు భాషతో పనిలేదని అనేవారు. అలాగే ప్రపంచ నదులు, వాటి ప్రవాహం, సంగమంపై ఆసక్తి పెంచుకున్న అందెశ్రీ ప్రపంచ ప్రముఖ నదుల జన్మస్థలాలకు వెళ్లారు.

2011లో బ్రెజిల్‌లో ఉన్న అమెజాన్ నది పుట్టిన ప్రదేశంతో పాటు మిసిసిపి, నైలు, కాంగో, జాంబేజీ నదులను ఆయన స్పృశించారు. నదీ లోక నిధి పేరుతో కావ్య రచనలు చేసి.. నది నడిచిపోతున్నదమ్మ.. నన్ను నావనై రమ్మన్నదమ్మ అని పాడాటం అందె శ్రీ ప్రత్యేకత.

తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు, ఆటపాటలపై ప్రత్యేక ప్రేమను ప్రదర్శించిన న్యూయార్క్ ప్రవాసులు ఏనుగు లక్ష్మణ్, వాణీలు అనేక సార్లు అమెరికాలో అందెశ్రీకి ఆతిథ్యం ఇచ్చారు. అలాగే ఆయన దక్షిణ అమెరికా దేశాల యాత్రకు స్పాన్సర్ చేయటంతో పాటు లక్ష్మణ్ ఆయన వెంట ప్రయాణించారు.

ప్రస్తుతం న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం(నైటా) అధ్యక్షురాలుగా ఉన్న వాణి ఏనుగు, వారి కార్యవర్గ సభ్యులు, వ్యవస్థాపక సభ్యుడు అందెశ్రీ మరణం పట్ల తీవ్ర సంతాపం తెలిపారు. వారితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. హైదరాబాద్ లో నిర్మాణంలో ఉన్న అందెశ్రీ ఇళ్లు పూర్తయిన తర్వాత త్వరలోనే మరోసారి అమెరికాకు ఆహ్వానిద్దామని





అనుకున్నామని, ఇంతలోనే ఆయన మరణం తమకు తీవ్ర నిరాశను కలిగించిందని వారు అన్నారు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం




### మరెన్నో హనీమూన్ కేంద్రాలు:

హనీమూన్ కేంద్రాలుగా కేరళ నుంచి ఉత్తరాఖండ్ వరకు ప్రసిద్ధ ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. కేరళ బ్యాక్‌వాటర్స్, మున్నార్, కర్ణాటకలో కూర్గ్, మంగళూరు, ఆంధ్రప్రదేశ్‌లో అరకులోయ, మధ్యప్రదేశ్‌లో ఖజురహో, పచ్‌మడీ, రాజస్థాన్‌లో జైసల్మేర్, గోవా, హిమాచల్‌ప్రదేశ్‌లో సిమ్లా, కులుమనాలి, నైనిటాల్, డల్హౌసి, ఉత్తరాఖండ్‌లో డెహ్రాడూన్, ముస్సోరి ఇలా ఎన్నో పర్యాటక ప్రదేశాలు కొత్త దంపతులకు స్వాగతం పలుకుతున్నాయి.

బిడియాలకు గడియేసే మంత్రం.. భర్త నాడి పట్టే తంత్రం..భార్య మనసును అర్థం చేసుకునే మార్గం.. హనీమూన్. ఈ వేసవి ముహూర్తాల్లో ఒక్కటవుతున్న జంటల కోసం కొన్ని హనీమూన్ కేంద్రాల వివరాలిస్తున్నాం. క్షేమంగా వెళ్లి.. ప్రేమతో రండి!!

# అమృత రాత్రులు... అద్భుత యాత్రలు...




## పగడపు దీవుల్లో..



ఎంత హనీమూన్‌కొచ్చినా.. ఆలుమగలిద్దరూ ఒకరినొకరు చూస్తూ ఎంతసేపు కూర్చుంటారు. పిల్లగాలితో అల్లరి చేయొద్దా! చల్లని సముద్ర గర్భంలో దాగిన అందాలు చూడొద్దా! ఇన్ని చేయాలంటే లక్షద్వీప్ వెళ్లాలి! ఈ పగడపు దీవుల్లోని ప్రకృతి సౌందర్యం బాలమిత్ర కథల్లో వర్ణించిన దానికన్నా గొప్పగా ఉంటుంది. అరేబియా సముద్రంలో చెల్లాచెదురుగా ఉన్న ఈ ద్వీపాలకు దేశవిదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. మండువేసవిలోనూ గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలు దాటదు. సాయంకాలం.. సాగర తీరంలో.. శీతల పవనాలు వీస్తుంటాయి. లక్షదీప్ 36 దీవుల సమూహం. ఇందులో 10 ద్వీపాల్లో మాత్రమే జనాలున్నారు. వీటిలో బంగారం, కడమట్, అగట్టి ద్వీపాలు చాలా బాగుంటాయి. ఒక ద్వీపం నుంచి మరో ద్వీపానికి వెళ్లడానికి ఫెర్రీలు ఉంటాయి. కయాకింగ్, వాటర్ స్కీయింగ్, విండ్ సర్ఫింగ్, స్కూబా డైవింగ్ వంటి సాహసక్రీడలకు వేదికలు ఈ ద్వీపాలు.

**ఎలావెళ్లాలి:**

* విమానయానం: లక్షద్వీప్ చేరుకోవాలంటే ముందుగా కొచ్చిన్ వెళ్లాలి. అక్కడి నుంచి అగట్టి ద్వీపానికి విమాన సర్వీసులు ఉన్నాయి. అగట్టి నుంచి బంగారం ద్వీపానికి స్పీడు బోట్‌లో వెళ్లాలి.

* **నౌకా విహారం:** కొచ్చిన్ నుంచి లక్షద్వీప్ ప్రధాన దీవులకు నౌకలో వెళ్లొచ్చు. అక్కడ విహారం, బస, బోటింగ్ అన్ని కలిపి ప్యాకేజీలు కూడా ఆఫర్ చేస్తుంటారు నౌకల నిర్వాహకులు. వీటి ధర రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు (జంటకు) ఉంటుంది.

**విడిది:** భారీ రిసార్టులు, కాటేజీలు, రెస్టారెంట్లు, బడ్జెట్ హోటళ్లు కూడా అందుబాటులో ఉన్నాయి.

అనుకూల సమయం: జూన్‌సెప్టెంబర్ మినహా ఏడాదంతా వెళ్లొచ్చు.

## వసంత సంతసం..

హనీమూన్‌కు పశ్చిమ బంగలో అనువైన చోటేది అని అడిగితే టక్కున చెప్పే పేరు డార్జిలింగ్. ఇక్కడికి యాభై కిలోమీటర్ల దూరంలో మరో అందమైన ప్రాంతం ఉంది. దాని పేరు కాలింపాంగ్. ఎత్తయిన కొండలు.. వాటిపై బౌద్ధారామాలు.. ప్రశాంతతకు చిరునామాగా ఉంటుందీ ఊరు. ఆమని రాకతో పర్వతాలన్నీ పచ్చటి దుప్పటి కప్పుకొని పసందుగా కనిపిస్తాయి. అరవిరిసిన ఆర్కిడ్ పూలు వసంతగాలికి వలపులు నేర్పిస్తాయి. తీస్తా నది తీరంలో విహారం, కొండల్లో లోయల్లో ప్రయాణం.. కాలింపాంగ్‌కు వెళ్లిన నూతన వధూవరులకు మధురమైన అనుభూతినిస్తాయి. పనిలో పనిగా పక్కనే ఉన్న డార్జిలింగ్‌నూ సందర్శించి రావొచ్చు.



**ఎలా వెళ్లాలి**

* విమాన యానం: కాలింపాంగ్‌కు సమీపంలో ఉన్న విమానాశ్రయం బాగ్‌డోగ్రా. కోల్‌కతా, దిల్లీ నుంచి విమాన సర్వీసులు ఉన్నాయి. బాగ్‌డోగ్రా నుంచి కాలింపాంగ్‌కు 78 కిలోమీటర్లు. ట్యాక్సీలు, బస్సుల్లో వెళ్లొచ్చు.

* రైలు మార్గం: కాలింపాంగ్‌కు సుమారు 75 కిలోమీటర్ల దూరంలో జల్పాయ్‌గురి రైల్వేస్టేషన్ ఉంటుంది. సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్టణం నుంచి గువాహటి వెళ్లే రైళ్లు జల్పాయ్‌గురి మీదుగా వెళ్తాయి. అక్కడి నుంచి బస్సులు, ట్యాక్సీలో కాలింపాంగ్‌కు చేరుకోవచ్చు.

**విడిది:** హనీమూన్ జంటల కోసం కాటేజీలుంటాయి. భారీ హోటళ్లు బోలెడున్నాయి. సిక్కిం వంటకాలు, టిబెటిన్ రుచులు, ఉత్తరాది పదార్థాలు ఆస్వాదించవచ్చు.

**అనుకూల సమయం:** వర్షాకాలం మినహా ఎప్పుడైనా వెళ్లొచ్చు. వసంత రుతువులో గిరులన్నీ విరులతో విశేషంగా అలరిస్తాయి.

## బంధంలో బందీల్లా..

కొంగుముడి వేసుకున్న కొత్త దంపతులకు అండమాన్‌నికోబార్ దీవులు అద్భుతమైన హనీమూన్ స్పాట్. అందమైన వాతావరణం, రకరకాల మనుషులు, కాస్త హడావుడి.. ఇంకాస్త కలివిడితనం కలగలసిన దీవులివి. బడ్జెట్ లెక్కలు చూసుకునే వారు, డబ్బును మంచినీళ్లలా ఖర్చు చేసే వారు.. ఎవరైనా అండమాన్‌లో జాలీగా గడిపేయొచ్చు. సాహస క్రీడలకు అండమాన్ కేరాఫ్. అండమాన్ రాజధాని పోర్ట్‌బ్లెయర్‌లో దర్శనీయ స్థలాలు ఎన్నో ఉన్నాయి. స్వతంత్ర సమరయోధులను అప్పట్లో బందీలుగా ఉంచిన కాలాపాని జైలును ఇప్పుడు మ్యూజియంగా మార్చారు. రోజూ సాయంత్రం స్వాతంత్ర్య సంగ్రామంపై లేజర్ ప్రదర్శన నిర్వహిస్తారు. పోర్ట్‌బ్లెయర్‌కు 35 కిలోమీటర్ల దూరంలోని హావెలాక్ బీచ్ చాలా అందంగా ఉంటుంది.

**ఎలా వెళ్లాలి?**

* **విమాన యానం:** హైదరాబాద్, విశాఖపట్టణం నుంచి పోర్ట్‌బ్లెయర్‌కు సింగిల్‌స్టాప్



విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి.

* **నౌకా విహారం:** విశాఖపట్టణం, చెన్నై నుంచి పోర్ట్‌బ్లెయర్‌కు క్రూయిజ్‌లు కూడా నిర్వహిస్తారు. సుమారు రెండున్నర గంటలు సాగే సాగరయానం మరుపురాని అనుభూతిని కలిగిస్తుంది.

**విడిది:**

బడ్జెట్ హోటళ్లు, భారీ రెస్టారెంట్లు, రిసార్ట్‌లు ఉన్నాయి. రకరకాల రుచులు లభిస్తాయి. అండమాన్‌లో తెలుగువారు చాలామంది ఉన్నారు. అన్నపూర్ణ మెస్, ఆంధ్రాభోజనం వంటి బోర్డులు చాలానే కనిపిస్తాయి.

**అనుకూల సమయం:**

వేసవిలో కాస్త ఉక్కపోత ఉన్నా.. సాయంత్రాలు మనోహరంగా ఉంటాయి. రుతుపవనాల వేళ అందంగా ఉంటుంది. శీతాకాలంలో అద్భుతంగా ఉంటుంది.

## గూటి పడవలో..

'అలల ఊపులో తీయని తలపులు చెలరేగుతాయ'ని ఓ సినీకవి సెలవిచ్చారు. అలాంటి మధురమైన భావన ఎక్కడ పడితే అక్కడ కలగదు. కొలనులో నీరు నిద్దురోయినట్టే ఉండాలి. కొత్త పెళ్లి కూతురు కుదురుగా కూర్చోవడానికి గూటి పడవ కావాలి. మంచుకౌగిట వణుకుతున్న కొండల ప్రతిరూపాలు.. నీలి నీటిలో తేలాడుతుండాలి. ఇవన్నీ ఉన్నాయంటే అది శ్రీనగర్‌లోని దాల్ సరస్సు అయి ఉంటుంది. మనదేశంలో ఎవర్‌గ్రీన్ హనీమూన్ స్పాట్ శ్రీనగర్.. కొత్త దంపతులకు ఇది ప్రేమ్‌నగర్. మదిని పరవశింపజేసే దాల్ సరస్సు.. ఆ పక్కనే ఊసులు పంచుకోవడానికి షాలీమర్ తోట.. దాని చెంతనే హౌస్‌బోట్లతో నగీన్ సరస్సు.. ఈ ఉత్సాహం నుంచి తేరుకోకముందే తులిప్ తోట.. స్వర్గమిక్కడే అంటుంది. కొత్తకాపురాన్ని దిద్దుకుంటున్న ఆలుమగలకు ఇంతకన్నా అనువైన చోటు ఎక్కడ దొరుకుతుంది చెప్పండి. అందుకే హనీమూన్ అనగానే టూరిస్ట్ ఆపరేటర్లు, ట్రావెల్ సంస్థలు కూడా ముందుగా కశ్మీర్ పేరే చెబుతారు. అందునా శ్రీనగర్ సౌందర్యం ప్రత్యేకమైనది. వేసవి ముహూర్తాల్లో ఒక్కటైన వారు.. మరింత దగ్గరవ్వడానికి ఇంతకన్నా మంచి ప్రదేశం మరొకటి ఉండదు.

**ఎలా వెళ్లాలి?**

* విమాన యానం: హైదరాబాద్, విజయవాడ, 



విశాఖపట్టణం నుంచి సింగిల్ స్టాప్, టూస్టాప్ విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి.

* **రైలు మార్గం:** సికింద్రాబాద్, విజయవాడ, వరంగల్, నెల్లూరు, ఒంగోలు నుంచి జమ్మూ వెళ్లే రైళ్లు (వీక్లీ) అందుబాటులో ఉన్నాయి. జమ్మూ నుంచి శ్రీనగర్‌కు సుమారు 266 కిలోమీటర్లు. బస్సులు, ట్యాక్సీల్లో వెళ్లొచ్చు. ఈ ప్రయాణం భలే పసందుగా ఉంటుంది.

**విడిది:**

శ్రీనగర్‌లో భారీ రెస్టారెంట్లు ఎన్నో. అద్దెకు హౌస్‌బోట్లు లభిస్తాయి. దేశీవిదేశీ వంటకాలు, కశ్మీరీ రుచులు కావాల్సిన రుచులన్నీ లభిస్తాయి.

**అనుకూల సమయం:** వానాకాలం మినహా ఏడాదంతా వెళ్లొచ్చు.

ఆ గిరిపై ఎప్పుడో ఒకటో శతాబ్దంలో నిలబడిన కోట గోడలవి. అప్పుడు తెరుచుకున్న ఖిల్లా ద్వారాలు.. శాతవాహనులను సాదరంగా ఆహ్వానించాయి. మౌర్యులను ఆదరించాయి. కాకతీయులకు దారి చూపాయి. దిల్లీ సుల్తానులకూ ప్రవేశం కల్పించాయి. బహమనీలు వస్తుంటే బహుపరాక్ అన్నాయి. రెడ్డి రాజులకు వత్తాసు పలికాయి. మొఘలాయి చక్రవర్తులు, గోల్కొండ నవాబులు, నిజాం రాజులు ఎవరొచ్చినా స్వాగతించాయి. వారంతా వచ్చారు.. వెళ్లారు. చరిత్రలో కలిసిపోయారు. ఆ ద్వారాలు ఇంకా అక్కడే ఉన్నాయి. ఇప్పుడు మనల్ని స్వాగతించడానికి ఏడాదికోసారి మాత్రమే తెరుచుకుంటున్నాయి. ఆ సమయం ఆసన్నమైంది..

# రామగిరి రమ్మంటోంది

ఈ రాజులెవరూ ఇక్కడికి రాకముందు ఇక్కడికి శ్రీరామచంద్రుడు వచ్చాడటంటారు. సీతమ్మ, లక్ష్మణస్వామి సమేతంగా ఇక్కడ కాలుమోపాడని చెబుతారు. అందుకే ఈ ప్రాంతం రామగిరి అయింది. రాజుల కన్ను పడటంతో రామగిరి కాస్తా ఖిల్లాగా మారింది. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలో ఉంటుందీ ఖిల్లా. బేగంపేట గ్రామానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న భారీ గుట్టపై.. ఇంతెత్తు గోడలతో.. ఓ పక్క బండలతో.. అన్నివైపుల నుంచి చుట్టిముట్టిన చెట్టూచేమతో ఠీవీగా దర్శనమిస్తుంది. శ్రావణ మాసం వచ్చిందంటే తండోపతండాలుగా భక్తులు తరలివస్తారు. కొండల్లో ఐదారు కిలోమీటర్లు ప్రయాణిస్తారు. దారిలో పచ్చని ప్రకృతిని చూసి పరవశిస్తారు. సెలయేళ్లను చూసి మురిసిపోతారు. రామచంద్రుడ్ని కీర్తిస్తూ ఖిల్లాలోకి ప్రవేశిస్తారు. కొండలలో నెలకొన్న సీతారామాలక్ష్మణుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేస్తారు. బృందాలుగా వన భోజనాలు చేస్తారు.

రామగిరిపైకి వెళ్లిన వారు ఖిల్లా అంతా కలియ తిరుగుతారు. కోటలు, బురుజులు చూసి ఆశ్చర్యపోతారు. తొమ్మిది ప్రాకారాలతో నిర్మించిన రాతిగోడలు ఔరా అని



పిస్తాయి. 120 అడుగుల ఎత్తుండే గోడలపై అడుగడుగునా ఆనాటి శిల్పకారుల కళావిన్యాసం అబ్బురపరుస్తుంది. దుర్గంలో గజశాల, అశ్వశాల, చెరశాల, ప్రతాపరుద్రుల కోట, నిమ్మకోట, సోలుకోట ఇలా అలరించే విశేషాలెన్నో! బ్రహ్మగుండం, గంగగౌరి సవతుల బావులు, కూర్మగుండం, మల్లెవనం, బృందావనం పర్యాటకులకు కనువిందు చేస్తాయి. శ్రీరాముడు ప్రతిష్ఠించాడని చెప్పే శివలింగం మరో అద్భుతం. కొండపై నుంచి వచ్చే నీటి ధార నేరుగా శివలింగంపై పడటం విశేషం. ఇలాంటి వింతలు, విశేషాలన్నీ ఆస్వాదించాలంటే శ్రావణ మాసంలో సాధ్యమవుతుంది. ఈ నెల దాటిందా.. కోట ద్వారాలు మూసుకుంటాయి. ఖిల్లా మీద మనుషుల సంచారం దాదాపుగా ఉండదు.

### శతాబ్దాల రాచనగరి

క్రీ.శ ఒకటో శతాబ్దంలో గౌతమీపుత్ర శాతకర్ణి రామగిరిని సైనిక స్థావరంగా చేసుకొని ఉత్తర భారతాన్ని పాలించారని శాసనాల ద్వారా తెలుస్తోంది. మౌర్య చక్రవర్తులు చంద్రగుప్తుడు, బిందుసారుడు, అశోకుడు రామగిరి పాలనా కేంద్రంగా దక్షిణాదిని పాలించారు. కాకతీయ రాజులు ఓరుగల్లు తరహాలో రామగిరిపై తొమ్మిది కోటలు, దర్వాజాలను నిర్మించారట. దిల్లీ సుల్తాన్ మహ్మద్‌బిన్‌తుగ్లక్ ఓరుగల్లు కోటను ముట్టడించే ముందు రామగిరిని హస్తగతం చేసుకున్నాడు. తర్వాతి కాలంలో రామగిరిపై బహమనీ సుల్తానులు, వారి నుంచి రెడ్డిరాజుల ఆధిపత్యం కొనసాగింది. మొఘలాయిలు సైతం రామగిరిని పాలించారు. గోల్కొండ నవాబులు, నిజాం రాజుల వరకు రామగిరిపై రాచగిరి కొనసాగింది.

### ఇలా వెళ్లొచ్చు..

రామగిరిఖిల్లా.. పెద్దపల్లి నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. పెద్దపల్లిమంథని రహదారిలోని నాగేపల్లి (బేగంపేట అడ్డరోడ్డు)లో దిగాలి. ఇక్కడి నుంచి బస్సులో కాని, ఆటోలో 4 కిలోమీటర్లు ప్రయాణిస్తే బేగంపేట చేరుకోవచ్చు. ఇక్కడి నుంచి 3 కిలోమీటర్లు కాలినడకన వెళ్తే ఖిల్లాకు చేరుకోవచ్చు.

* ఖిల్లాలోని విశేషాలు చూసుకుంటూ రాములోరి గుడికి చేరుకోవాలనుకుంటే దాదాపు 5 కిలోమీటర్లు నడవాల్సి వస్తుంది. నేరుగా దైవ దర్శనం చేసుకోవాలనుకుంటే.. రత్నాపూర్ గ్రామం నుంచి సొంత వాహనాల్లో ఖిల్లా వరకు వెళ్లవచ్చు. ఖిల్లాపై వన్యమృగాలు సంచరించే అవకాశం ఉండటంతో, ఒంటరిగా వెళ్తే ప్రమాదం. బృందాలుగా వెళ్లాలి.

# సంపాదకీయం..

## బీహార్‌లో రాహుల్ ఓట్ చోరీ పనిచేసేనా?

బీహార్ ఎన్నికలు ఓ రకంగా బిజెపికన్నా రాహుల్‌కే ప్రతిష్టాత్మకంగా భావించాలి. ఓట్ చోరీ పేరుతో మన ఎన్నికల వ్యవస్థను అప్రతిష్టపాలు చేసిన వ్యక్తిగా రాహుల్ చరిత్రలో నిలిచపోయారు. ఆయన మోడీ పాలన పై చేస్తున్న విమర్శలను సహేతుకంగా తీసుకోవచ్చు. కానీ ఓట్ చోరీ పేరుతో వ్యవస్థను బద్నాం చేస్తూ వచ్చారు. ఆయన అమెరికా వెళ్లి వచ్చినప్పుడల్లా ఏదో అంశం మీద రచ్చచేస్తూనే ఉన్నారు. పంజాబ్‌లో రైతులను రెచ్చగొడుతూనే వచ్చారు. అధికార లేమితో కాంగ్రెస్ నానాయాగీ చేస్తోందని చెప్పుకోవచ్చు. అలాగే తమ యూపిఎ పాలనలో అక్రమాలపై నోరు మెదపడం లేదు. బీహార్‌లో కాంగ్రెస్ ఎన్నటికీ విజయం సాధించే అవకాశం లేదు. బీహార్‌లో తొలిద ముగిసింది. రెండోదశ మంగళవారం ఎన్నికలు జరుగబోతు న్నాయి. ఈ క్రమంలో తమదే అధికారం అని చెబుతున్న రాహుల్, ఓడిపోతే ఓట్‌చోరీతో మరింత యాగీ చేయాలన్న బలమైన వ్యూహంతో ఉన్నారు. ఇకపోతే ఇప్పటికే 9సార్లు సిఎంగా గెలిచిన నితీశ్ కుమార్‌కు ఓ రకంగా ఇవి చివరి ఎన్నికలని భావించాలి. గెలిస్తే పదోసారి సిఎంగా ప్రమాణం చేస్తారా లేదా అన్నది చూడాలి. 2020 అసెంబ్లీ ఎన్నికలలో జనతాదళ్ ఓట్ల వాటా 15 శాతంగా ఉన్నది. నితీశ్ మళ్లీ అధికారానికి రావడానికి ఇది విశేషంగా తోడ్పడింది. 2005 నుంచి ప్రతి ఎన్నికల్లోను రెండు వర్గాలు నితీశ్‌కు పూర్తి మద్దతునిస్తున్నాయి. మహిళలు, బాగా వెనుకబడిన కులాలవారు నితీశ్‌కు మద్దతునిస్తున్నారు. మహిళా ఓటర్ల శక్తిని జాతీయ రాజకీయ పక్షాలు కనుగొనక ముందే నితీశ్‌కుమార్ మహిళా ఓటర్ల ఆదరాభిమానాలను బాగా చూరగొన్నారు. మృదుభాషిగా పేరున్న నితీశ్ తన ప్రత్యర్థిగా మారిన స్నేహితుడు, పల్లెటూరి మనిషిలా వ్యవహరించే లాలూప్రసాద్‌కు పూర్తిగా భిన్నమైన వ్యక్తి. ఈ కారణంగానే మహిళా ఓటర్లను నితీశ్




ఆకట్టుకున్నారు. అచంచలమైన కుల సంబంధిత విధేయతలతో పాటు మహిళా ఓటర్ల మద్దతు నితీశ్ విజయాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. 2005లో నితీశ్ మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు చదువుకుంటున్న బాలికలు అందరికీ ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు. ఆనాడు లబ్ది పొందిన బాలికలు ఇప్పుడు వయోజన ఓటర్లుగా ఉన్నారు. ఆ మహిళా ఓటర్లే నితీశ్ నాయకత్వానికి, అధికార ప్రాభవానికి వెన్నుదన్నుగా ఉన్నారని చెప్పకతప్పదు. ఈ కారణంగానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నితీశ్‌ను ఎన్‌డిఎ పక్షాన ఉంచుకునేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. తనను వ్యతిరేకించిన వారిని క్షమించే అలవాటు లేని మోదీ, ఒకప్పుడు నితీశ్ తనను తీవ్రంగా వ్యతిరేకించారన్న వాస్తవాన్ని పూర్తిగా విస్మరించడం వెనక బీహార్ ప్రయోజనాలే ముఖ్యమని గుర్తించారని చెప్పకతప్పదు. బిహార్‌లో బీజేపీ ఎదుగుదలకు నితీశ్‌తో పొత్తు తప్పనిసరని ప్రధానమంత్రి గ్రహించారు. మరోమారు బీహార్‌లో ఎన్‌డిఎ విజయం సాధిస్తే.. సమీప భవిష్యత్తులో బిహార్‌లో కూడా ఏక్‌నాథ్ షిండే లాంటి తిరుగుబాటు సంభవించే అవకాశం లేకపోలేదు. అయినా ప్రస్తుతానికి మాత్రం బీజేపీ ఎన్నికల విజయాలకు నితీశ్‌కుమార్ ఆవశ్యకత అమితంగా ఉన్నది. లాలూప్రసాద్ యాదవ్‌తో ఉన్న రాజకీయ అనుబంధాన్ని తెగతెంపులు చేసుకుని నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనత పార్టీతో నితీశ్ జతకట్టంలో ఆయన స్వార్థం కూడా ఉంది. నిరంతరాయంగా బీహార్ సిఎంగా నిలిచిపోవాలన్న ఆయన కాంక్షను కాదనలేం. రాజకీయ సౌలభ్యం కోసమే ఆయన మళ్లీ మోదీతో చేయి కలిపారు. అలాగని బీజేపీకి నితీశ్ కుమార్ పట్ల ప్రత్యేక ప్రేమ ఏమీ లేదు. 2013లో ప్రధానమంత్రి పదవికి అవసరమైన అర్హతలు నరేంద్ర మోదీకి లేనేలేవని తొట్టతొలుత నిరసన తెలిపిన నేత నితీశ్‌కుమార్. ఈ విషయాన్ని బీజేపీ మరచిపోయి ఉండదు. అయితే బిహార్‌లో ఎన్డీఏకు సమర్థంగా నేతృత్వం వహించగల నాయకుడు మరొకరు లేరన్న వాస్తవమూ బీజేపీకి బాగా తెలుసు. నితీశ్‌కు ప్రత్యామ్నాయంగా మరెవ్వరూ లేనందునే బీజేపీ ఆయనను ముఖ్యమంత్రిగా కొనసాగనిస్తోంది. వయసు మీదపడడంతో నితీశ్ కుమార్ కూడా తప్పని పరిస్థితుల్లో మోదీయే సర్వం అయిన ఢిల్లీ దర్బార్‌కు విధేయుడుగా ఉంటూ వస్తున్నారు. అయితే మారుతున్న కలానుగుణంగా బిహార్ ఓటర్లలో అత్యధికులు సైతం మౌలిక మార్పులు కోరుకుంటున్నారు. మరి ప్రశాంత్ కిశోర్ నాయకత్వంలోని జన్ సురాజ్ పార్టీకి వారు ఓటు వేస్తారా అన్న చర్చ కూడా సాగుతోంది. తేజస్వి యాదవ్ కూడా గట్టి పోటీ ఇస్తున్నారు. ఇకపోతే బీహార్ ఓటర్ల సవర్ణ రచ్చ కూడా చర్చకు దారితీస్తోంది. ఎంఐఎం కూడా ముస్లిం డామినేట్ ఉన్న ప్రాంతాల్లో బరిలోకి దిగింది. ఈ క్రమంలో బీహార్ ఎన్నికలు ఎవరికి మొగ్గ చూపుతాయి, ప్రజలు ఆలోచన ఏ విధంగా ఉందన్నది కూడా అంతుచిక్కడం లేదు. ఇప్పటికే బిహార్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేయడంలో నితీశ్ రికార్డు సృష్టించారు.ఇప్పటికి మొత్తం తొమ్మిది సార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అనేక పరిమితులు ఉన్నప్పటికీ బిహార్‌కు ఆయన నాయకత్వం తప్పనిసరి అని పలువురు, ముఖ్యంగా బీజేపీ భావిస్తోంది. ఐదు సంవత్సరాల క్రితం కొత్త తరం బిహారీ రాజకీయ నాయకుడు చిరాగ్ పాశ్వాన్‌ను ప్రోత్సహించడం ద్వారా నితీశ్ స్థాయిని తగ్గించేం దుకు బీజేపీ ప్రయత్నించింది. నితీశ్ ప్రాధాన్యాన్ని తగ్గించడం ద్వారా జనతాదళ్ (యునైటెడ్) పార్టీ ఓటర్లను తనవైపు తిప్పుకోవాలన్నది బీజేపీ ఎత్తుగడ. గత శాసనసభ ఎన్నికల్లో జనతాదళ్(యు) కేవలం 43 సీట్లు మాత్రమే కైవసం చేసుకోగా బీజేపీ 74 నియోజక వర్గాలలో జయపతాక నెగురవేసింది. అయినప్పటికీ నితీశ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించేందుకు బీజేపీ సంకోచించింది. తమ సొంత అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేసేందుకు సుముఖత చూపలేదు. నితీశ్ కుమార్ అపరచాణక్యుడు. బీజేపీ ఎత్తుగడలను అర్థం చేసుకు న్నారు. ఆ పార్టీతో పొత్తును కొనసాగించడం ప్రమాదకరమని భావించారు. మహారాష్ట్రలో శివసేనను నిలువు నా చీల్చివేసిన రీతిలో బిహార్‌లో తన పార్టీని బీజేపీ చీల్చకుండా ఉంటుందా అని నితీశ్ ఆలోచించారు. అందుకే బిజెపిని తన దగ్గరే పెట్టుకుని జాగ్రత్తగా ఉంటున్నారు. అయితే ఈసారి ఆయన పదోసారి సిఎంగా బాధ్యతలు స్వీకరిస్తారా లేదా అన్నది చూడాలి. ఈక్రమంలో తేజస్వీ యాదవ్ సిఎం కావడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకు కాంగ్రెస్ ఘట్‌బంధన్ కలసివస్తుందా లేదా అన్నది చూడాలి. అలాగే రాహుల్ ఓట్‌చోరీ ఆరోపణలు ఏమేరకు ఫలితం ఇస్తుందో చూడాలి.

## దక్షిణాఫ్రికా జి20 సదస్సు బహిష్కరణ

దక్షిణాఫ్రికాలో నిర్వహించనున్న జీ20 సదస్సును బహిష్కరిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం సంచలనంగా మారింది. అమెరికా తరఫున ఒక్క అధికారి కూడా జీ20 సదస్సుకు హాజరు కాబోరని ట్రంప్ ప్రకటించడంపై దక్షిణాఫ్రికా ప్రభుత్వం మండిపడింది. ట్రంప్, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో చేసిన విమర్శలపై దక్షిణాఫ్రికా ప్రభుత్వం, పాలక పార్టీ ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేశాయి. 'అమెరికా నాయకులు చేసిన ప్రకటనలు పూర్తిగా అవాస్తవాలు. వారిది సామ్రాజ్యవాద జోక్యం. దక్షిణాఫ్రికాలో జాతి వివక్ష లేదు. వర్ణవివక్ష సృష్టించిన అసమతుల్యతలను పరిష్కరించడానికే దక్షిణాఫ్రికా చట్టాలు పని చేస్తాయి. సామ్రాజ్యవాద సరసాలను మేము సరదాగా తీసుకోము. అమెరికా పాల్గొనకపోయినా సమ్మిట్ కొనసాగుతుంది. ట్రంప్ వాదనలు, కట్టుకథలను మేము తిరస్కరిస్తున్నాము. మా సార్వభౌమాధికారం పట్ల ట్రంప్ యంత్రాంగానికి ఎలాంటి గౌరవమూ లేదు. వారు మమ్మల్ని అమెరికా ఉపదేశం అని భావిస్తున్నారు' అంటూ




ఏఎన్‌సీ సెక్రటరీ జనరల్ ఫికిలే ముబాలులా విమర్శించారు. క్షిణాఫ్రికా ప్రభుత్వం శ్వేత జాతి రైతులతో క్రూరంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన ట్రంప్ జీ20 శిఖరాగ్ర సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు నవంబర్ 22–23 తేదీల్లో దక్షిణాఫ్రికా వేదికగా ఈ సదస్సు జరగబోతోంది. ఆఫ్రికానెర్ కమ్యూనిటీ (దక్షిణాఫ్రికాలోని శ్వేతజాతి రైతులు)పై హింస, దాడులు, భూములు, పొలాల స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలకు పాల్పడుతున్న వారికి దక్షిణాఫ్రికా ప్రభుత్వం మద్దతు ఇస్తోందని ట్రంప్ ఆరోపించారు. అలాంటి దేశంలో జీ20 సదస్సు జరగడం అవమానకరమని, ఆ సదస్సుకు అమెరికా తరఫు నుంచి ఎవరూ హాజరుకాబోరని ట్రంప్ స్పష్టం చేశారు.

# ఓటుహక్కు పై పడకూడదు వేటు

అమెరికానే కాదు, ప్రపంచాన్ని గందరగోళానికి గురిచేస్తున్న ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా నిలబడి జోహ్రాన్ మమ్దాని న్యూయార్క్ నగర్ మేయర్‌గా గెలిచాడు. ఇది ప్రపంచ దృష్టిని ఎంతగానో ఆకర్షించింది. ఆధిపత్యం, అణచివేతలు ఎల్లకాలం సాగవనే సత్యాన్ని ఓటు శక్తి ద్వారా న్యూయార్క్ ప్రజలు నిరూపించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ అధినాయకుడు రాహుల్ గాంధీ కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ హర్యానాలో జరిగిన గత ఎన్నికల్లో ఓట్ల గోల్ మాల్‌కు, ఓట్ల చోరికి పాల్పడి ఏ విధంగా గెలిచిందో అనేక ఉదాహరణలతో వివరించారు. అమెరికాలో జరిగిన జోహ్రాన్ మమ్దాని విజయంగానీ, ఓట్లను తొలగించి బిజెపి గెలిచిందనే వార్త గానీ ఈ రెండు ఓటు శక్తిని నిరూపిస్తున్నాయి. ప్రాచీన కాలంలో మధ్యయుగాల్లో కత్తులు, బాణాలు, తుపాకులు ఏ విధంగా రాజ్యాలను గెలుచుకోవడానకి ఉపకరించాయో ఆధునిక కాలంలో ఓటు హక్కు కూడా అటువంటి పాత్రను పోషిస్తుంది. జోహ్రాన్ మమ్దాని భారతీయ సంతతికి చెందినవాడు కావడం ఒక విశేషం. ఇదే విధంగా హైదరాబాద్‌కు చెందిన గజాలా హష్మి వర్జినియా గవర్నర్‌గా గెలిచింది. గజాలా హష్మి కూడా ట్రంప్ ప్రత్యర్థి పార్టీ డెమొక్రాట్ పార్టీకి చెందిన అభ్యర్థి.

ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అనేది సాదాసీదా పరికరం కాదు, ఇది ఒక వ్యవస్థ రూపురేఖలు మార్చగలిగే అధునాతన ఆయుధం. ఓటు హక్కు కోసం ఎన్నో ఉద్యమాలు జరిగాయి. అయితే మొదట్లో మన దేశంతో సహా ఏ దేశంలోనైన కేవలం సంపన్న వర్గాలకే ఓటు హక్కు ఉండేది. అప్పుడు అది ఒక రకంగా పాక్షిక ప్రజాస్వామ్యమే. ఒక రకంగా అది సంపన్న స్వామ్యమే. అయితే భారత దేశంలో బాబా సాహెబ్ అంబేద్కర్ లాంటి వాళ్ళు సార్వజనీన ఓటు హక్కు కోసం అంటే కులం, మతం, ధనిక, పేద, అక్షరాస్యత, నిరాక్షరాసత, ఆడ, మగ తేడా లేకుండా వయోజనులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలని పట్టుబట్టి సాధించిపెట్టారు. నిరక్షరాస్యులు, పేదలు ఓటు హక్కును సరైన పద్ధతిలో ఉపయోగించలేరని వాదించిన వాళ్ళున్నారు. అయితే భారత దేశంలో అనుభవం దానిని తప్పని రుజువు చేసింది. కేంద్రంలో, రాష్ట్రాల్లో ప్రజావ్యతిరేక చర్యలకు పూనుకున్న ప్రభుత్వాలు నడిపిన పార్టీలను ఓడించి, ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణ కోసమేనని ప్రజలు రుజువు చేశారు. అయితే గత పది సంవత్సరాల క్రితం అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం చాలా రాష్ట్రాల్లో ముఖ్యంగా ఎన్నికలు జరగబోతున్న రాష్ట్రాల్లో ఓట్లను తొలగించడం, దొంగ ఓట్లను చేర్చడం చేస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీతో సహా ప్రతిపక్షాలన్నీ ఆరోపిస్తున్నాయి. దీనికి రుజువులు కూడా చూపెడుతున్నారు. అయితే ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో చాలా ముఖ్యమైన అంశమని మనం భావిస్తున్నాం. అది రుజువైంది కూడా. రాజ్యాంగ రచనా సమయంలో కొంతమంది అప్పుడే పేదలు, చదువులేని వారికి ఓటు హక్కు వద్దని మాట్లాడారు. దానికి వాళు ్ళ చూపెట్టిన కారణం, ఈ ఆధునిక పద్ధతులు వాళ్ళకు అర్థం కావని చెప్పారు. అయితే అప్పుడేమో కానీ ఇప్పుడు దీని అంతరార్థం అర్థమవుతున్నది. ఓటు ఒక హక్కు మాత్రమే కాదు, ఒక బలం. ఒక శక్తి. అది అందివస్తే పేదలు ముఖ్యంగా నిమ్నకులాలు తమ మాట వినవనే వాళ్ళకు తెలుసు. అప్పుడేమో చట్టపరంగా, విధాన నిర్ణయంగా అడ్డుకోవాలని చూశారు. అయితే ఇప్పుడు ఓటు హక్కు శక్తి తెలిసి వచ్చింది. కాబట్టి, తమకు అనుకూలంగా లేని సమూహాల, కులాల, మతాల ఓట్లను తొలగిస్తున్నట్టు అర్థమవుతుంది. ఇది 75 ఏళ్ళ కింద ఆనాటి ఆధిపత్య కులాలు, సంపన్నవర్గాలు చేసిన కుట్రకు ఇది కొనసాగింపు మాత్రమే.

అయితే 75 ఏళ్ళ తర్వాత ఈ ఓట్ల మీద దాడి ఎందుకు జరుగుతుంది? ఓటు హక్కు అనే దానిని ఎందుకు నిర్వీర్యం చేయాలనుకుంటున్నారు? ఇది కేవలం ఓటు హక్కుతో మొదలై ఓటు హక్కుతో ముగిసిపోయేది కాదు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో రాజకీయ సమానత్వానికి ప్రాతిపదిక. ప్రజలందరూ ప్రజాస్వామ్యంలో తమ ప్రతినిధులను



ఎన్నుకోవడానికి ఉన్న ఏకైక అవకాశం. ఇది ప్రజలను పాలనలో భాగస్వాములు కావడానికి ఉన్న అవకాశం. కానీ ఇది ఈ రోజు ముగింపుకు వచ్చినట్టు కనపడుతున్నది. ఎవరైతే ప్రభుత్వాలకు అనుకూలంగా లేరో, ఎవరైతే ఈ పాలన మారాలని అనుకుంటున్నారో వారికి ఓటు హక్కు లేకుండా చేయడమంటే, రాజకీయ ప్రజాస్వామ్యానికి చరమగీతం పాడడమే. బీహార్, అసోం, హర్యానాలలో ఇదే జరిగినట్టు విమర్శలున్నాయి. ఇది నూటికి నూరు పాళ్ళు అవాంఛనీయం.

ఇలా జరిగే ప్రమాదముందని, 75 ఏళ్ళ కిందట రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ హెచ్చరిక కూడా చేశారు. 1949, నవంబర్ 25వ తేదిన రాజ్యాంగ సభలో చివరి ఉపన్యాసం చేస్తూ 'జనవరి, 26, 1950 నుంచి మనం వైరుధ్య జీవితంలోకి ప్రవేశించబోతున్నాం. ఒక మనిషి, ఒక ఓటు, ఒక విలువ అనే విధానం ద్వారా రాజకీయ సమానత్వాని సాధించుకున్నాం. కానీ సామాజిక, ఆర్థిక రంగాల్లో ఇంకా అసమానతలు కొనసాగుతున్నాయి. ఇవి ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యం ప్రమాదపు అంచుల్లోకి వెళ్లుతోంది' బాబా సాహెబ్ అంబేద్కర్ అన్న మాటలు ఈ రోజు అద్దంలో ప్రతిబింబం లాగా కనిపిస్తున్నాయి. దాని ఫలితమే ఓటు హక్కును దుర్వినియోగం చేస్తూ, ప్రజలను ఓటు హక్కుకు దూరం చేయడమే.

గత 75 సంవత్సరాలుగా ఆర్థిక ప్రగతి ఎంతో సాధించిందని మన దేశం గురించి మనం చెప్పుకుంటున్నాం. కానీ ప్రజలు అభివృద్ధికి దూరంగా జరిగిపోయారు. ఆర్థిక రంగం రోజు రోజుకు గుత్తాధిపత్యం సంపాదించుకుంటున్నది. గతంలో వృత్తులు ఉన్న సమూహాలు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కలిగి ఉండేవి. ఈ రోజు అన్ని పారిశ్రామికాధిపతులు, కార్పొరేట్లు ఆక్రమించుకున్నారు. దీనితో ఆర్థిక స్వాలంబనను కలిగి ఉన్న ప్రజలు పరాధీన బతుకులు అనుభవిస్తున్నారు. గ్రామీణ పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. రెండోది ఆధునీకరణ, యాంత్రీకరణ, కంప్యూటరీకరణ ద్వారా శ్రమ చేసే శక్తి ఉన్న యువతి యువకులు నిరుద్యోగులుగా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సాంప్రదాయకంగా తరతరాలుగా అనుభవిస్తున్న ఆర్థిక స్వాతంత్ర్యం ఈ రోజు కార్పొరేట్లు చెప్పుచేతుల్లోకి వెళ్ళాయి.

అంతేకాకుండా గతంలో కన్నా చాలా ఎక్కువ ఆర్థిక వ్యత్యాసాలు పెరిగాయి. ఇందులో ఆధిపత్య కులాలు ఆర్థికంగా లాభపడితే నిమ్న, వెనుకబడిన కులాలు, దళితులు, ఆదివాసులు ఆర్థిక పరాన్నజీవులుగా తయారయ్యారు. గత పదేళ్ళలో అదానీ కంపెనీ ఆస్తుల పెరుగుదల చూస్తే మనం ఎటువైపు ప్రయాణం చేస్తున్నామో అర్థం కాగలదు. అంతేకాకుండా కేవలం 10 శాతం కుటుంబాలు దేశంలో సంతృప్తిగా ఉన్నాయి. మిగతా 90 శాతంలో పది శాతం పైకి వెళ్ళడానికి ప్రయత్నిస్తున్న మధ్య తరగతి వర్గాలు, మిగిలిన 80 శాతం కుటుంబాలు ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల మీద బతుకుతున్నాయి. ఉచితాల పేరుతో చేతులు ఉన్న పని చేయని అవిటి వాళ్లులాగా తయారు చేస్తున్నారు. ఇది చాలా ఎక్కువగా, బిసిలు, ఎస్‌సిలు, ఎస్‌టిలు, మైనారిటీలు ఉన్నారు. అదే విధంగా సామాజికంగా ఈ దేశం కులాలుగా విడిపోయి ఉన్నవి. కులాలు ఒకదానికొకటి విడివిడి ఉన్నాయి. అంతేకాకుండా ఎక్కువ, తక్కువ అనే సామాజిక సంబంధాలను కలిగి ఉన్నాయి. సనాతన పేరుతో నడుస్తున్న హిందూ వ్యవస్థ కులాలను పెంచి పోషిస్తుందే. కానీ వాటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదు. దానికి సాక్షాలుగా దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు, కులాంతర వివాహాలు జరిగితే ఆ వ్యక్తులపై దాడుల, హత్యలు ఈ దేశంలో సామాజిక సమానత్వాన్ని ఒక అందుకోలేని ఆకాశంగా తయారు చేస్తున్నారు. ఆర్థిక, సామాజిక అసమానతలలో వివక్షకు, అసమానతలకు, అణచివేతలకు గురవుతున్న ప్రజలు వ్యవస్థ మీద, ప్రభుత్వాలమీద తిరుగుబాటు చేస్తారేమోననే భయంతో ప్రభుత్వాల భవిష్యత్‌ను నిర్ణయించే ఓటు హక్కును దూరం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయి. అందువల్ల సామాజిక, ఆర్థిక సమానత్వలు సాధించనంత వరకు రాజకీయ ప్రజాస్వామ్యం ఒక నిజమైన అబద్ధం.

## అప్పుల నరకాసురుడిని వధించడమే కర్తవ్యం!

తెలుగు రాష్ట్రాలను అప్పుల నరకాసురుడు వేధిస్తున్నాడు. కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాడు. మనమంతా కలసికట్టుగా ఈ అప్పుల నరకాసరుడిని అంతమొందించాలి. వీడిని మనకు తగించిన రాజకీయ పార్టీలకు తగు విధంగా బుద్ధి చెప్పాలి. లేకుంటే మనమంతా కాళరాత్రిలో కాలం గడపాల్సి ఉంటుంది. ఉమ్మడిగా ఉన్న ఎపిలో లేనంత అవినీతి అక్రమాలు, విడిపోయాక విజృంభించాయి. ఏటా దీపావళి ఆనందాలు వెల్లివిరియాల్సిన చోట..అప్పుల అమావాస్య కమ్ముకుంది. ప్రస్తుత, గత పాలకుల తీరు చూస్తే ఈ రెండు రాష్ట్రాలు అప్పుల ఊబినుంచి బయటపడే మార్గం కనిపించడం లేదు. వరాల జల్లు కురిపించడం ద్వారా ప్రజలను నట్టేట ముంచుతున్నారు. అధికారంలోకి వచ్చాక చేతికి ఎముక లేదన్నట్లుగా ఉచిత పథకాలు అమలు చేస్తున్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడులాంటి పెద్దమనిషి అడపదడపా హెచ్చిరిస్తున్నా పట్టించుకోవడం లేదు. అలాగని చేసిన అప్పులతో రాష్ట్రాలు బాగుపడ్డాయా అంటే అదీ లేదు. నెలనెలా జీతాలు ఇవ్వడం కూడా ఇప్పుడు ప్రభుత్వ ప్రతిభకు గీటురాయిగా మారింది. అప్పులు చేయడంలో వెనుకబడకూడదని పాలక పార్టీలూ భావిస్తున్నాయి. సంక్షేమ పథకాల పేరిట డబ్బు పంచి పెట్టినంత మాత్రాన ప్రజలు మళ్లీ మళ్లీ గెలిపిస్తున్నారా అంటే అదీ లేదు! ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ ప్రజలకు డబ్బు పంచుతున్నాయి. తాజాగా బీహార్ ఎన్నికలు కావచ్చు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కావచ్చు డబ్బు పందేరాలకు రెడీగా ఉన్నారు. ప్రజలుకూడా వచ్చిన కాడికి తీసుకోవాలన్న ధోరణిలో ఉన్నారు. అయితే డబ్బు తీసుకుంటున్న ప్రజలు మాత్రం తాము అనుకున్న వారికే ఓటు వేస్తున్నారు. ఈ డబ్బు పంపకం ఆగితే తప్ప మన ప్రజాసవామ్యం బాగుపడదు. అలాగే సంక్షేమ పథకాల పేరుతో చేస్తున్న డబ్బు పందేరాలకు కూడా ఎక్కడో ఒక చోట ఫుల్ స్టాప్ పడకపోతే తిప్పలు తప్పేలా లేవు. అలాగే పథకాలు పొందని ప్రజలు, పన్నులు చెల్లిస్తున్న వారు దీనిని నిలదీయక మానరు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో గత పన్నెండేళ్లుగా ఇదే సాగింది. భావి తరాలకు మంచి భవిష్యత్తు ఇవ్వడం ఎలా అన్నది పక్కకు పోయింది. అపపులు చేసి పండగ చేస్తున్నారు. ప్రజలు కూడా అలవాటు పడ్డారు. ఓట్ల పండగ రావాలని కోరుకుంటున్నారు. ఈ పద్ధతి మారకుంటే అభివృద్ధి అన్నది పక్కకు పోయి పంచడమే పాలన అనే పద్ధతి పాకిపోతుంది. అలా జరగకుండా రాజకీయ పార్టీలను కట్టడి చేయడానికి ప్రజలే పూనుకోవాలి. ప్రజలే చొరవ తీసుకొని హద్దులు మీరుతున్న సంక్షేమ పథకాల అమలుపై నిరసన గళం ఎత్తాలి. అప్పులతో ప్రజలకుపంచడంతో పాటు, పాలకులు కూడా సోకులు చేసుకుంటున్నారు. ఇలా ఎంతకాలం చేసిన ప్రజలకు అమావాస్య చీకట్లు తప్పవు. పాలకలుకు నిత్యదీపావళి కూడా తప్పదు. తాజా పరిస్థితులు చూస్తుంటే ఆందోళన కలుగుతోంది. ఎంతకాలమీ అప్పుల జాతర అన్నది తెలియడం లేదు. లేని పక్షంలో రెండు తెలుగు రాష్ట్రాలు కోలుకోలేని విధంగా అప్పుల ఊబిలో కూరుకుపోతాయి!అప్పు చేయనిదే పూట గడవని పరిస్థితి ఉన్నప్పటికీ రెండు రాష్ట్రాల్లో కొనసాగుతోంది. ప్రభుత్వాల మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయి. ఏదడిగినా లేదనకుండా హామీలు ఇచ్చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకేఈ దుస్థితి ఎందుకు వచ్చిందన్నది తెలుసుకోవాలి. ఎపి విభజన తరవాత కెసిఆర్, జగన్ చేసని నిర్వాకంతో ఇదంతా మొదలయ్యింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తెలంగాణ ధనిక రాష్ట్రమని కెసిఆర్ ఊరూరా ఊదరగొట్టారు. రాష్ట్రం రెవెన్యూ మిగులులో ఉందని కేసీఆర్ ప్రకటించారు. అదే సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్ రూ.20 వేల కోట్లకు పైగా రెవెన్యూ లోటుతో ఏర్పడింది. 11 ఏళ్లు గడిచేసరికి ధనిక రాష్ట్రమైన తెలంగాణ కూడా అప్పుల




కుప్పగా మారింది. అప్పు కోసం వెళితే దొంగను చూసినట్టు చూస్తున్నారని ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాస్తవాన్ని బయటపెట్టారు. తెలంగాణ పరువు తీస్తావా అని బిఆర్‌ఎస్ నేతలు రేవంత్‌పై కత్తులు దూస్తున్నారు. ఆంధ్రలో కూడా ఇదే దుస్థితి ఉంది. జగన్ తనను తాను ఓ యువరాజుగా భావించి భీమిలి బీచ్ వద్ద ప్యాలెస్‌లు కట్టుకున్నారు. రాష్ట్రం అప్పులు పది లక్షల కోట్లు దాటాయి. అటు ధనిక రాష్ట్రం, ఇటు రెవెన్యూ లోటుతో ఏర్పడిన రాష్ట్రం కూడా కుదేలవడానికి కారణం ఇద్దరు నేతలే అని వేరుగా చెప్పనక్కర్లేదు. పలు పతకాల పేరుతో రాష్ట్రాలను లూటీ చేయించారు. ప్రజాధనాన్ని పప్పు బెల్లాల్లా పంచిపెట్టడంతో ఇప్పుడు దివాళకు చేరుకున్నాయి. దారుణం ఏమంటే సంక్షేమ పథకాలకు కూడా అప్పులు చేయవలసి వస్తోంది. వేలకోట్లు వడ్డీలుగా చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆస్తులను కుదువ పెట్టడమే కాకుండా, భవిష్యత్ ఆదాయాలను కూడా తాకట్టు పెట్టి అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయడం వల్లనే తెలుగునాట దుర్భర పరిస్థితి దాపురించింది.

[illegible] సం రాజకీ[illegible]ట్టలు అడ్డమైన గడ్డి తింటాయనడానికి ఈ రెండు రాష్ట్రాల ఆర్థిక దుస్తితి కారణంగా చెప్పు కోవాలి. ఇప్పుడు పాలకులు దీని నుంచి బయటపడకుండా మరీ అప్పులు చేసేస్తున్నారు. సంక్షేమం పేరిట అలవికాని పథకాలను ప్రకటిస్తూ తెలుగు రాష్ట్రాలను దివాలా తీయిస్తున్నారు. దీంతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కరువై అల్లాడుతున్నారు. ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని తెలిసి కూడా కొత్త పథకాల ప్రకటనలో పాలకపార్టీలు తగ్గేదేలే అన్నట్టుగా పోటీ పడుతున్నాయి. ఉచితబస్సు, ఉచిత బియ్యం, ఉచితంగా వేల రూపాయల బదిలీలు ..వంటివన్నీచేస్తున్నారు. కానీ ఒక్క రోడ్డు గుంత పూడ్చడానికి మత్రం డబ్బులు ఉండడం లేదు. ఎన్నికల్లో ప్రయోజనం పొందడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలను రేసు గుర్రాల్లా వదిలారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల కోసం ప్రస్తుత రేవంత్ హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములను కూడా ఎడా పెడా అమ్మేస్తున్నారు. అయినా రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతూనే ఉంది. రైతు రుణ మాఫీ కోసం దాదాపు పాతిక వేల కోట్ల రూపాయలు పంచిపెట్టిన తీరువవల్ల కలిగిన ప్రయోజనం కూడా అంతంత మాత్రమే. జగన్ బాధపోయినా ఆంధ్రప్రదేశ్‌లో కూడా సంక్షేమ పథకాల జాతర ఆగడం లేదు. తెలంగాణలో ప్రారంభమైన అనేక పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆపసోపాలు పడుతున్నరు. 2 1ప్పుల నరకాసురుడిని మనమే కాల్చాలి. ప్రజలే ఇందుకు పూనుకోవాలి. పథకాల పేరుతో చేస్తున్న అప్పులపై ప్రశ్నించాలి. అప్పుడే మనకు నిజమైన దీపావళి అని గుర్తించాలి.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com అక్షరగళం ప్రతి అక్షరం ప్రజల కోసం

# సన్ రైజర్స్‌లోకి రోహిత్ శర్మ..?

ఐపీఎల్ 2026 సందడి మరికొన్ని రోజుల్లో మొదలుకాబోతుంది. నవంబర్ 15లోపు అన్ని ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను బీసీసీఐకి సమర్పించాలి. ఈ నేపథ్యంలో ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు.. ఇప్పుడు తమ టాప్ ప్లేయర్లను ఎక్స్ఛేంజ్ చేసుకోబోతున్నట్లు వస్తున్న వార్తలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఈ ఒప్పందం జరిగితే ఇది ఐపీఎల్



చరిత్రలోనే అత్యంత హై ప్రొఫైల్ ట్రేడ్ అవుతుందంటున్నారు క్రీడా నిపుణులు.ముంబై ఇండియన్స్ ప్లేయర్ రోహిత్ శర్మ హైదరాబాద్కు.. బదులుగా స్టార్ బ్యాట్స్‌మన్ ట్రావిస్ హెడ్ ముంబై ఇండియన్స్ కు మారబోతున్నట్లు నెట్టింట్లో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. అయితే ఈ విషయంపై ఇప్పటికైతే రెండు ఫ్రాంచైజీలు.. ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన జారీ చేయలేదు. అయితే ఇదంతా 'ఎక్స్'లో ఇండియన్ క్రికెట్ అనే అకౌంట్ నుండి వచ్చిన పోస్ట్‌తో మొదలైంది. రోహిత్ శర్మ ఆధ్వర్యంలో ముంబై ఇండియన్స్ ఐపీఎల్‌లో ఐదుసార్లు టైటిల్స్‌ని గెలుచుకుంది. హిట్‌మ్యాన్ బ్యాటింగ్‌కు వెన్నెముక లాంటివాడు.. తనకున్న అనుభవంతో ఏ జట్టునైనా టాప్‌లో ఉంచుతాడు. రోహిత్ మరియు అభిషేక్ శర్మ కలిసి ఓపెనింగ్ చేస్తే ఐపీఎల్ రికార్డులు బద్దలవుతాయని చాలా మంది క్రికెట్ ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ముంబై ఫ్యాన్స్ మాత్రం.. రోహిత్ శర్మ హైదరాబాద్ కి వెళ్తే అది తమకు పెద్ద నష్టమని బాధపడుతున్నారు. అయితే ట్రావిస్ హెడ్ కూడా చాలా దూకుడుగా ఆడగల సమర్థుడు. 2023 ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్‌పై చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన హెడ్.. హైదరాబాద్ తరపున కూడా గత సీజన్‌లో బలమైన ప్రదర్శన ఇచ్చాడు. ఇక ఈ ఒప్పందం జరిగితే ట్రావిస్ హెడ్ ముంబై తదుపరి కెప్టెన్ కావొచ్చని కొంతమంది అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ ట్రేడ్ చేస్తే రోహిత్ శర్మ అనుభవం, అభిషేక్ శర్మ దూకుడు కలిపి బలమైన ఓపెనింగ్ లైనప్‌ను తయారు చేసుకోవచ్చని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పటికే ఐపీఎల్ అభిమానులు డిసెంబర్ మినీ వేలం మరియు ట్రేడ్ విండో ప్రకటనల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరి ఎక్స్ఛేంజ్ పుకార్లు నిజమవుతాయా లేదా కేవలం ఊహాలేనా అనేది త్వరలోనే తెలియనుంది. ఐపీఎల్ 2026కి ముందు ఈ డ్రామా అభిమానుల్ని మరింత ఆకట్టుకుంటోంది.



## 14 నుండి టెస్ట్ సిరీస్ ప్రారంభం

## భారత్- దక్షిణాఫ్రికా మధ్య

# రెండు టెస్టులు

### తిరిగి జట్టులోకి రానున్న రిషబ్ పంత్

దక్షిణాఫ్రికా జట్టు భారతదేశ పర్యటనకు వస్తోంది. ఈ టూర్‌లో భారత్, దక్షిణాఫ్రికా మధ్య 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టీ20 మ్యాచ్‌ల సిరీస్ ఆడనున్నారు. దక్షిణాఫ్రికా, భారత్ సిరీస్ శుక్రవారం, నవంబర్ 14 నుంచి ప్రారంభం కానుంది. ఇరు జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ ఈ 14న ప్రారంభం కానుంది. భారత టెస్ట్ జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ టెస్ట్ సిరీస్‌లో గాయం నుంచి కోలుకున్న వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ తిరిగి జట్టులోకి రానున్నాడు. అంతకుముందు పంత్‌ను దక్షిణాఫ్రికా ఏతో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఏ జట్టుకు కెప్టెన్‌గా నియమించారు. పంత్ చేరికతో బ్యాటింగ్ మరింత పటిష్టం కానుంది. భారత్, దక్షిణాఫ్రికా మధ్య టెస్ట్ సిరీస్ నవంబర్ 14న ప్రారంభమై నవంబర్ 26 వరకు జరుగుతుంది. మొదటి టెస్ట్ మ్యాచ్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్, రెండో మ్యాచ్ గౌహతిలో జరగనుంది. భారత్- దక్షిణాఫ్రికా జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ నవంబర్ 14 నుంచి నవంబర్ 18 వరకు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నారు. భారత కాలమానం ప్రకారం ఈ టెస్ట్ మ్యాచ్ ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ టెస్ట్ సిరీస్‌లో రెండో మ్యాచ్ నవంబర్ 22 నుంచి నవంబర్ 26 వరకు గౌహతిలోని బర్సపరా స్టేడియంలో జరుగుతుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఉదయం 9 గంటలకు మొదలవుతుంది. భారత జట్టు ఓపెనింగ్ బాధ్యతలు మరోసారి యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ భుజాలపై పడనున్నాయి. ఈ ఇద్దరు బ్యాట్స్‌మెన్స్ ఇటీవల అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. స్వదేశీ పరిస్థితులలో పరుగులు చేసిన అనుభవాన్ని కలిగి ఉన్నారు. ప్రారంభ ఇన్నింగ్స్ తర్వాత, కెప్టెన్ శుభ్‌మాన్ గిల్, సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్, వైస్-కెప్టెన్ రిషబ్ పంత్ మిడిల్ ఆర్డర్‌కు స్థిరత్వంతోపాటు, దృఢత్వాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. కోల్‌కతా స్పిన్-ఫ్రెండ్లీ పిచ్‌లను పరిగణనలోకి తీసుకుంటే, ఈ బ్యాటింగ్ లైనప్ బాగా సమతుల్యంగా పరిగణిస్తున్నారు. వీరు ప్రత్యర్థి బౌలర్లకు సవాలుగా మారవచ్చు.

## సౌతాఫ్రికా వరల్డ్ రికార్డ్!

సౌతాఫ్రికా ఏ జట్టు వరల్డ్ రికార్డ్ సృష్టించింది. భారత్ ఏతో తాజాగా జరిగిన నాలుగు రోజుల అనధికార టెస్టులో సఫారీ జట్టు ఈ ఘనత సాధించింది. ఈ మ్యాచ్‌లో 416 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన బవూమా సేన 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ క్రమంలోనే భారత్ 44 రోజుల కిందట క్రియేట్ చేసిన రికార్డును సౌతాఫ్రికా బద్దలు కొట్టింది.నవంబర్ 06న బెంగళూరు వేదికగా సౌతాఫ్రికా ఏ- భారత్ ఏ జట్ల మధ్య రెండో అనధికార టెస్టు మ్యాచ్ ప్రారంభం అయ్యింది. ఈ మ్యాచ్‌లో భారత్ ఏ రెండు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా (225- 10, 382- 7d) స్కోర్లు నమోదు చేసింది. ఇక సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 221 రన్స్‌కే ఆలౌట్ అయ్యింది. అయితే 416 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా పుంజుకుంది. నిలకడగా ఆడిన సౌతాఫ్రికా బ్యాటర్లు ఏకంగా ఐదుగురు అర్ధ శతకాలు నమోదు చేశారు.ఓపెనర్లు జోర్డన్ హెర్మన్ (91 పరుగులు), లెసిగో సెనోక్వానే (77 పరుగులు) మంచి ఆరంభం ఇవ్వగా, హంజా (77 పరుగులు), టెంబ బవూమా (59 పరుగులు), కానోర్ (52 పరుగులు) రాణించారు. దీంతో లక్ష్యాన్ని సౌతాఫ్రికా 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ క్రమంలోనే సౌతాఫ్రికా రికార్డు క్రియేట్ చేసింది.ఈ ఛేదనతో బవూమ సేన భారత్ రికార్డ్‌ను బ్రేక్ చేసింది. 'ఏ' జట్ల టెస్టు మ్యాచ్‌ల్లో నాలుగో ఇన్నింగ్స్‌లో ఛేజ్ చేసిన అత్యధిక లక్ష్యం ఇదే కావడం విశేషం. ఇదివరకు ఈ రికార్డు భారత్ ఏ జట్టుపై ఉండేది. 44 రోజుల కిందటే ఆస్ట్రేలియా ఏ జట్టుపై భారత్ ఏ ఈ ఘనత సాధించింది. 413 పరుగుల టార్గెట్‌ను విజయవంతంగా ఛేదించి ఈ రికార్డ్ కొట్టింది. 44 రోజుల్లోనే ఈ రికార్డును సౌతాఫ్రికా బ్రేక్ చేసింది. కాగా, ఈ రెండు జట్ల మధ్య జరిగిన తొలి అనధికార టెస్టులో భారత్ ఏ నెగ్గింది. 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్న సౌతాఫ్రికా ఇక్కడ రెండు టెస్టు, మూడు వన్డే, ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లు ఆడనుంది. నవంబర్ 14న కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌కు భారత్ ఇప్పటికే జట్టును ప్రకటించింది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలో టీమ్‌ఇండియా బరిలోకి దిగనుంది.

**సౌతాఫ్రికా టెస్టు సిరీస్‌కు భారత్ జట్టు:**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్.

# రోహిత్, కోహ్లీ స్థానాలను భర్తీ చేయవచ్చు

### ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా

విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల వన్డే భవిష్యత్తుపై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా తీవ్రంగా స్పందించాడు. ప్రస్తుత క్రికెట్‌లో ఎవరి స్థానాన్ని అయినా భర్తీ చేయగల ఆటగాళ్లు ఉన్నారని అభిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ 2027 వన్డే ప్రపంచ కప్ ఆడతారా లేదా అనేది అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీకి కూడా పెద్ద సవాలుగా మారింది. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు బాగా బ్యాటింగ్ చేసి, కుర్రాళ్లకు తాము గట్టిపోటీ ఇస్తామని.. వారితో పోటీపడి పరుగులు సాధించగలమని నిరూపించుకున్నారు. ముఖ్యంగా రోహిత్ శర్మ మంచి టచ్‌లో కనిపించాడు. కోహ్లీ వరుసగా రెండు మ్యాచ్‌లలో డకౌటైనా.. మూడో వన్డేలో కీలక ఇన్నింగ్స్‌తో కమ్ బ్యాక్ చేశాడు. 2 సంవత్సరాల తర్వాత జరిగే ప్రపంచ కప్‌లో ఆడేందుకు వీరి స్థానంపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది.



ఒక భారత జర్నలిస్ట్‌తో ఆసీస్ మాజీ కెప్టెన్ స్టీవ్ వా మాట్లాడుతూ, "ఆటగాళ్ళు బాధ్యత తీసుకోవాలి. ఎందుకంటే ఎవరూ ఈ ఆట కంటే పెద్దవారు కాదని అర్థం చేసుకోవాలి. మీరు మిమ్మల్ని ఆట కంటే ఎక్కువ అని భావించ కూడదు. ఎవరైనా రోహిత్, కోహ్లీ స్థానాన్ని భర్తీ చేయ వచ్చు. ఏ ఆటగాడు కూడా ఆటను తన ఇష్టం వచ్చినట్లు ముందుకు తీసుకెళ్లలేరని నేను నమ్ముతున్నాను. చివరికి, సెలక్షన్ కమిటీ ఛైర్మన్ జట్టు ప్రయోజనాల కోసం నిర్ణయం తీసుకోవాలని" కీలక వ్యాఖ్యలు చేశాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజ ఆటగాళ్లను ట్రయల్స్‌లో ఉంచలేమని అజిత్ అగార్కర్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే మీడియా నివేదికల ప్రకారం, 2027 ప్రపంచ కప్ కోసం జట్టును ఎంపిక చేయడం కేవలం ప్రదర్శన ఆధారంగానే ఉంటుందని BCCI అధికారులు చెబుతున్నారు. రోహిత్ శర్మ ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో 202 పరుగులు చేసి రాణించాడు. తన బ్యాటింగ్ ప్రదర్శనకుగానూ రోహిత్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు కూడా అందుకున్నాడు. మరోవైపు, విరాట్ కోహ్లీ చివరి వన్డే మ్యాచ్‌లో 74 పరుగులు చేసి ఫామ్‌లోకి వచ్చినట్లు సంకేతాలు ఇచ్చాడు. ఈ ప్రదర్శన ఆధారంగా ప్రపంచ కప్‌లో ఆడేందుకు తాను కూడా రేసులో ఉన్నానని చూపించాడు. స్టీవ్ వా మాట్లాడుతూ.. "అజిత్ అగార్కర్‌తో ఆటగాళ్లకు గుడ్ రిలేషన్ ఉంటుందని నేను ఆశిస్తున్నాను. కానీ అదే సమయంలో ఆటగాళ్లతో తగినంత దూరం పాటించాలి. అనుభ వజ్ఞులైన ఆటగాళ్లతో సమన్వయం చేసుకోవడం ముఖ్యమే. కానీ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఏమను కుంటున్నారు?. దేని ఆధారంగా జట్టు ఎంపిక జరుగు తుందనే విషయంపై ముందే క్లారిటీ ఇవ్వడం మంచిది. అనుభవానికి ప్రాధాన్యత ఇస్తారో, లేక ఆ సమయంలో ఫామ్, పరుగులు చేసే తీరును పరిగణనలోకి తీసు కుంటుందో బీసీసీఐ సెలక్షన్ కమిటీ డిసైడ్ చేసుకో వాలి. ప్రతి ఒక్కరిని రీప్లేస్ చేసే సత్తా ఉన్న యువ ఆటగాళ్లు ఉన్నారని గుర్తుంచుకోవాలని" సూచించాడు.



# కోచ్‌లు అప్‌డేట్ కావాలి

### గౌతమ్ గంభీర్

ఓపెనర్లు మినహా బ్యాటింగ్ ఆర్డర్‌కు అంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. టీ20ల్లో ఎన్ని పరుగులు చేశామనేది ముఖ్యం కాదని, ఎంత ప్రభావం చూపించామనేదే కీలకమని చెప్పుకొచ్చాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ఐదు టీ20ల సిరీస్‌ను టీమిండియా 2-1తో కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ విజయం నేపథ్యంలో గంభీర్.. బీసీసీఐ టీవీతో మాట్లాడాడు. ప్రపంచకప్‌కు మూడు నెలల సమయం మాత్రమే ఉందని ఆటగాళ్లంతా సిద్ధంగా ఉండాలని సూచించాడు. కాలంతో పాటు టీ20 క్రికెట్ కూడా మారుతుందని, కోచ్‌లు కూడా అప్‌డేట్ కావాలని అభిప్రాయపడ్డాడు.'శ్రీలంకలో నేను హెడ్ కోచ్‌గా బాధ్యతల చేపట్టిన తొలి రోజు నుంచి ఇప్పటి వరకు ఒకే ఐడియాలజీతో ఉన్నాను. ఈ విషయంలో ఎలాంటి మార్పు లేదు. ఓపెనర్లను మినహాయిస్తే.. బ్యాటింగ్ ఆర్డర్‌కు అంతగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదు. ఓపెనర్లు మినహా మిగతా బ్యాటింగ్ లైనప్‌లో మార్పులు ఉంటాయి. ఎందుకంటే టీ20 క్రికెట్‌లో పరుగులు ఎన్ని చేశామనేది ముఖ్యం కాదు. ఎంత ప్రభావం చూపించామనేదే కీలకం.జనాలు కొన్నిసార్లు పరుగులు, ప్రభావాన్ని వేర్వేరుగా చూడలేరు. తప్పుగా లెక్కిస్తారు. టీ20ల్లో ఫలితం మనం చూపించే ప్రభావంపైనే ఆధారపడి ఉంటుంది. 120 బంతుల గేమ్‌లో ప్రతీ బంతిపై అత్యంత ప్రభావాన్ని చూపించాలి. అందుకే మేం తొలి రోజు నుంచే అందుకు తగిన బ్యాటింగ్ ఆర్డర్‌ను ఎంచుకున్నాం. ఈ ఆటను కూడా మేం అదే విధంగా ఆడాలనుకుంటున్నాం.టీ20ల్లో మేం సగటు, స్ట్రైక్రేట్‌ల గురించి ఆలోచిస్తూ ఆడాలనుకోవడం లేదు. ఏ పరిస్థితిలో ఏ ఆటగాడు ఎంత ప్రభావం చూపగలడనే దాని గురించే మేం ఆలోచిస్తున్నాం. ఇది ఈ జట్టుకు చాలా ముఖ్యమైనది. నా అభిప్రాయం ప్రకారం కాలంతో పాటు టీ20 క్రికెట్ మారుతుంది. కోచ్‌లు మారకపోతే ఆటలో వెనుకబడిపోతాం. టీ20 క్రికెట్‌లో మేం కాలానికి ముందే ఉండాలనుకుంటున్నాం. మా కుర్రాళ్లు ఈ ఆలోచనకు బాగా అలవాటు పడ్డారు. వారు ఈ స్ఫూర్తిని కొనసాగిస్తున్నారు.భారత జట్టులో అద్భుతమైన ఆల్‌రౌండర్లు ఉన్నారు.

ఈ రకమైన స్పిన్ ఆల్‌రౌండర్ల లగ్జరీ ఏ జట్లకు ఉంది. విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు కొన్నిసార్లు పేస్ ఆల్‌రౌండర్ల లగ్జరీ మనకు దొరకదు. కానీ విదేశీ జట్లు మన దేశానికి వచ్చినప్పుడు అక్షర్, వాషింగ్టన్ సుందర్ వంటి ఆటగాళ్లు కీలకంగా మారుతారు. వారు బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ చేయగలరు. కేవలం బ్యాటర్‌గా కూడా జట్టులో కొనసాగగలరు. ఇది జట్టుకు కలిసొచ్చే అంశం. అప్‌కమింగ్ టీ20 ప్రపంచకప్‌లో ఈ ఇద్దరూ చాలా కీలకమవుతారు. వారికి ఉన్న నైపుణ్యాలతో ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించగలరు. ఈ కారణంతోనే వాషింగ్టన్ సుందర్‌కు గత 7-8 నెలలుగా జట్టులో అవకాశం ఇవ్వడం జరిగింది. ఛాంపియన్స్ ట్రోఫీలో ఐదో స్థానంలో అక్షర్ పటేల్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. బౌలింగ్‌లోనూ రాణించగలడు. పవర్ ప్లే, మిడిల్ ఓవర్లలో కూడా బౌలింగ్ చేస్తాడు. బౌలింగ్ ఆప్షన్స్ ఎక్కువగా ఉండటం ఎప్పుడూ మంచిదే. గతంలో చాలా సార్లు ఆరో బౌలింగ్ ఆప్షన్ గురించి ఎక్కువ చర్చ జరిగేది. కానీ ఇప్పుడు మాకు 7-8 బౌలింగ్ ఆప్షన్స్ ఉన్నాయి. ఇలాంటి ప్లేయర్లు ఉండటం జట్టుకు మంచిది. వారి సంఖ్య పెరుగుతూ ఉంటే భారత క్రికెట్‌కు తిరుగుండదు.'అని గంభీర్ చెప్పుకొచ్చాడు.

## రిటైన్, రిలీజ్ లిస్ట్‌లపై సన్‌రైజర్స్ ఫోకస్

ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తీవ్రంగా నిరాశపర్చింది. వై నాట్ 300 అంటూ భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఆరెంజ్ ఆర్మీ కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరకుండానే ఇంటి దారిపట్టింది. తమకే సాధ్యమైన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సీజన్‌ను ప్రారంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. అనూహ్యంగా వరుస పరాజయాలతో చతికిలపడింది. చివర్లో పుంజుకొని హ్యాట్రిక్ విజయం సాధించినా టోర్నీలో ముందుడుగు వేయలేకపోయింది. మొత్తం 14 మ్యాచ్‌ల్లో 6 గెలవడంతో పాటు ఓ మ్యాచ్ రద్దవ్వడంతో 13 పాయింట్స్ సొంతం చేసుకొని 6వ స్థానంతో సరిపెట్టుకుంది. మహమ్మద్ షమీ, నితీష్ కుమార్ రెడ్డి, ఇషాన్ కిషన్, ట్రావిస్ హెడ్, ప్యాట్ కమిన్స్, జీషన్ అన్సారీలు తీవ్రంగా నిరాశపర్చారు. ముఖ్యంగా మహమ్మద్ షమీ, నితీష్ కుమార్ రెడ్డి, జీషన్ అన్సారీల వైఫల్యం సన్‌రైజర్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. డిసెంబర్ చివరి వారంలో ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించిన మినీ వేలం జరగనుంది. నవంబర్ 15లోపు రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాలను ఫ్రాంచైజీలు ప్రకటించాల్సి ఉంటుంది.ఈ క్రమంలోనే ఫ్రాంచైజీలు తమ రిటైన్, రిలీజ్ లిస్ట్‌లపై ఫోకస్ పెట్టాయి. జట్టుకు భారంగా మారిన ఆటగాళ్లను వదులుకునేందుకు సిద్ధమయ్యాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా తమకు భారంగా మారిన ఆటగాళ్లను వదిలేసే ఆటగాళ్లను వదిలేయనుంది. ముఖ్యంగా టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీతో పాటు అభినవ్ మనోహర్, జీషన్ అన్సారీ, రాహుల్ చాహర్, ఆడమ్ జంపాలను సన్‌రైజర్స్ వదులుకునే ఛాన్స్ ఉంది. ఈ ఐదుగురు ఆటగాళ్లు జట్టుకు భారంగా మారారు. రూ. 10 కోట్లు పెట్టిన కొన్న మహమ్మద్ షమీ కనీసం 10 వికెట్లు కూడా తీయలేదు. 9 మ్యాచ్‌లు ఆడి 11.23 ఎకానమీతో 6 వికెట్లు మాత్రమే తీసాడు. రూ. 3.20 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన రాహుల్ చాహర్, రూ. 2.40 కోట్లకు తీసుకున్న ఆడమ్ జంపాలు కూడా జట్టు అంచనాలను అందుకోలేకపోయారు.రెండు మ్యాచ్‌లు ఆడి రెండే వికెట్లు తీసాడు. పేలవ ఫామ్‌తో రాహుల్ చాహర్‌కు తుది జట్టులో ఎక్కువ అవకాశాలు రాలేదు. ఒకే ఒక్క మ్యాచ్ ఆడి ఒకే ఓవర్ బౌలింగ్ చేశాడు. జీషన్ అన్సారీ తన తొలి మ్యాచ్‌లోనే మూడు వికెట్లు తీసి సంచలన ప్రదర్శన కనబర్చినా.. ఆ తర్వాత ఆ జోరు కొనసాగించలేకపోయాడు. రూ.3.20 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన అభినవ్ మనోహర్ కూడా తీవ్రంగా నిరాశర్చాడు.

**సన్‌రైజర్స్ హైదరాబాద్ వదిలేసే ఆటగాళ్ల జాబితా:**

మహమ్మద్‌షమీ(రూ.10 కోట్లు),రాహుల్‌చాహర్(రూ.3.20 కోట్లు),ఆడమ్ జంపా(రూ.2.4 కోట్లు), జీషన్ అన్సారీ(రూ.40 లక్షలు), అభినవ్ మనోహర్(రూ.3.20 కోట్లు)

**సన్‌రైజర్స్ రిటైన్ చేసుకునే జాబితా ఇదే:**

హెన్రీచ్ క్లాసెన్(రూ. 23 కోట్లు), ప్యాట్ కమిన్స్(రూ. 18 కోట్లు), ట్రావిస్ హెడ్(రూ. 14 కోట్లు), అభిషేక్ శర్మ(రూ.14 కోట్లు), నితీష్ కుమార్ రెడ్డి(రూ.6 కోట్లు), హర్షల్ పటేల్ (రూ. 8 కోట్లు), ఇషాన్ కిషన్ (రూ. 11.25 కోట్లు), సిమర్‌జీత్ సింగ్ (రూ. 1.50 కోట్లు), అథర్వ టైడ్ (రూ.30 లక్షలు), జయదేవ్ ఉనాద్కత్(రూ.1 కోటి), కమిందు మెండీస్(రూ.75 లక్షలు), అనికేత్ వర్మ(రూ.30 లక్షలు), బ్రైడన్ కార్స్(రూ. కోటి), అనికేత్ వర్మ(రూ. 30 లక్షలు), ఇషాన్ మలింగా(రూ. 1.20 కోట్లు), సచిన్ బేబీ (రూ. 30 లక్షలు)

అక్షరగళం
తెలుగు దినపత్రిక https://aksharagalam.com
ప్రతి అక్షరం ప్రజల కోసం

# మీ ఆతిథ్యం అదుర్స్..


## ప్రభాస్‌కు ఇమాన్వీ కితాబు



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఆతిథ్యం ఎలా ఉంటుందో అభిమానులు, మూవీ లవర్స్‌కు ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పటికే చాలా మంది సెలబ్రిటీలు ప్రభాస్ ఇంటి భోజనం ఎంత ప్రత్యేకమో పలు సందర్భాల్లో షేర్ చేసుకున్నారు. ప్రభాస్ ఆతిథ్యాన్ని స్వీకరించిన వారిలో తాజాగా అతడి కోస్టార్ ఇమాన్వీ కూడా చేరిపోయింది. ప్రభాస్, ఇమాన్వీ కాంబినేషన్‌లో ఫౌజీ సినిమా వస్తోన్న విషయం తెలిసిందే.

ఫౌజీ మూవీ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో కొనసాగుతోంది. షూటింగ్ బ్రేక్ టైంలో ఇమాన్వీ ప్రభాస్ ఇంట్లో పసందైన భోజనాన్ని రుచి చూసింది. సర్‌ప్రైజింగ్‌గా, సంతోషంగా అనిపించింది.. మీ ఆతిథ్యానికి నా మనస్సు, పొట్ట నిండుగా మారిపోయాయి. ప్రభాస్ గారు మీ ఆతిథ్యానికి ధన్యవాదాలు.. అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది ఇమాన్వీ. ఇప్పుడీ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. హను రాఘవపూడి డైరెక్ట్ చేస్తున్న ఫౌజీ చిత్రంలో శాండల్ వుడ్ భామ, సింగర్ చైత్ర జె అచర్ కీలక పాత్రలో నటిస్తోంది. పీరియాడిక్ యాక్షన్ రొమాంటిక్ డ్రామా వస్తోన్న ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. మేకర్స్ ఈ చిత్రాన్ని 2026 ఆగస్టులో విడుదల చేసేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. మారుతి డైరెక్షన్‌లో రాజాసాబ్ చేస్తున్నాడు. దీంతోపాటు సలార్ 2, కల్కి 2, స్పిరిట్ చిత్రాలు ట్రాక్‌పై ఉన్నాయి.

# ప్రేమంటే మూవీ నుంచి పెళ్లి షురూ పాట విడుదల



ప్రియదర్శి, ఆనంది జంటగా తెరకెక్కిన చిత్రం 'ప్రేమంటే' శ్రీ వేంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పీ బేనర్‌పై పుస్కూర్ రామ్‌మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. ఈనెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం నుంచి పెళ్లి పాట 'పెళ్లి షురూ'ను హీరోయిన్ శ్రీలీల చేతుల మీదుగా విడుదల చేశారు. వివాహ వేడుకల ఉత్సాహాన్ని, సంబరాన్ని తెలిపేలా ఉన్న ఈ పాటను శ్రీమణి రాశారు. దీపక్ బ్లూ, శ్రేయా ఘోషల్ ఆలపించగా, లియోన్ జేమ్స్ సంగీతం అందించారు. ఈ పాట నూతన జంట భావోద్వేగాలను అందంగా ఆవిష్కరిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: రాఘవేంద్ర తిరుణ్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్ రెడ్డి.

# రవితేజ కొత్త సినిమా పోస్టర్ ఔట్




మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఆర్76 తెరకెక్కుతున్నసంగతి తెలిసిందే. సుధాకర్ చెరుకూరి భారీగా ఈ సినిమాను ప్లాన్ చేసారు. ఇందులో రవితేజ సరసన ఆషికా రంగనాథ్ కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమాకి 'భర్త మహాశయులారా' టైటిల్ అనుకుంటున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే సోమవారం ఈ సినిమా టైటిల్ విడుదల చేయడానికి టైం ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ లోపే టైటిల్ సగం చెప్పి చెప్పకుండా పోస్టర్స్ లీక్ చేసారు. టైటిల్ చూస్తే.. మొత్తానికి 'భర్త మహాశయులారా' టైటిల్నే ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. తాజాగా ఓ పాట కోసం ప్రత్యేకమైన సెట్ వేశారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో రూపొందుతున్న అదిరిపోయే డ్యాన్స్ నంబర్ చిత్రీకరిస్తున్నారు. ఎమోషనల్ కథలతో అలరించే దర్శకుడు కిశోర్ తిరుమల ఈ చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకుల ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు. ఈ సినిమాకి సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ ప్రసాద్ మూరెళ్ళ. నేషనల్ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్. ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్.







# తండ్రీకొడుకుల పోటాపోటీ పాటల డ్యాన్స్‌లు

## దుమ్మురేపుతున్న చిరు, చరణ్‌లు

ఒకప్పుడు హీరోల మధ్య పోటీ ఉండేది. ఒక హీరో చేసిన కథ, పాట, ÷ట్ హిట్టయితే అలాంటిదే తమ హీరో కూడా చేయాలని అభిమానులు కోరుకునేవారు. అందుకు తగ్గట్టే హీరోలు, దర్శకులు ఆయా సన్నివేశాలను డిజైన్ చేసుకునేవారు. ఇప్పుడు సొంతవారి నుంచే పోటీ ఎదురవుతోంది. అటు చిరంజీవి , ఇటు రామ్‌చరణ్ తమ కొత్త చిత్రాల్లోని పాటలతో సోషల్ మీడియాను ఊపేస్తున్నారు. పోటీ మాట ఎలా ఉన్నా, మెగా అభిమానులు మాత్రం ఆనందంలో తేలియాడుతున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు' . నయనతార కథానాయిక. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీ సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. చిత్ర ప్రచారంలో భాగంగా విడుదల చేసిన 'మీసాల పిల్ల సాంగ్ యూత్‌ను విశేషంగా ఆకట్టుకుంటోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం, ఉదిత్ నారాయణ్ గాత్రానికి చిరంజీవి గ్రేస్ తోడవడంతో ఈ పాట ట్రెండ్ అవుతోంది. ఇప్పటికే 50 మిలియన్ వ్యూస్‌తో దూసుకుపోతోంది. సాంగ్‌ను ఎంజాయ్ చేస్తూ డ్యాన్స్ చేయడంలో చిరంజీవి ఆయనకు ఆయనే సాటి. తెరపై ఆ గ్రేస్ చిరులో మాత్రమే చూడగలం. తండ్రి బాటలోనే పయనిస్తూ అదరగొడుతున్నారు రామ్‌చరణ్. ఆయన కథానాయకుడి గా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పెద్ది'. జాన్వీకపూర్ కథానాయిక. ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీ నుంచి 'చికిరి.. చికిరి' అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఇందులో చరణ్ వేసిన స్టెప్ సోషల్‌మీడియాను ఊపేస్తోంది. చిన్నా, పెద్దా వయసుతో సంబంధం లేకుండా దీన్ని రీక్రియేట్ చేసి, పంచుకుంటున్నారు. అతి తక్కువ సమయంలోనే ఈ పాట 50 మిలియన్ వ్యూస్‌ను సొంతం చేసుకోవడం గమనార్హం. వచ్చే ఏడాది మార్చి 27న 'పెద్ది ప్రేక్షకుల ముందుకురానుంది.

# మెగాస్టార్‌తో మిల్కీ బ్యూటీ




మెగాస్టార్ చిరంజీవి హీరోగా, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి కామెడీ టైమింగ్, అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ కలవడంతో ఈ సినిమా ప్రేక్షకులకు నవ్వుల విందు పంచడం ఖాయమని అభిమానులు ఆశిస్తు న్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త ఫిలింనగర్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్ ఉండనుందని, అందులో మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా మెగాస్టార్‌తో కలిసి స్టెప్పులేయనున్నారని తెలుస్తోంది. ఇటీవల కాలంలో తమన్నా స్పెషల్ సాంగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారారు. ఆమె నటించిన 'కావాలయ్య', 'డా డా డాస్' వంటి పాటలు షేక్ చేశాయి. ఇప్పుడు అదే జోరుతో చిరంజీవి సినిమాలో కూడా మాస్ ఆడియన్స్‌కు అదిరిపోయే కిక్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ పాట కోసం చిత్ర యూనిట్ భారీ సెట్‌ను నిర్మించి, గ్రాండ్‌గా చిత్రీకరించేందుకు సన్నాహాలు చేస్తోందట.

పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో, మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు, కమర్షియల్ హంగుల కోసం దర్శకుడు అనిల్ రావిపూడి ఈ పాటను ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్నారని అంటున్నారు.



# ది రాజా సాబ్‌పై పెరుగుతున్న అంచనాలు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న హారర్-కామెడీ ది రాజా సాబ్ చిత్రం పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమా నుండి ఫస్ట్ సింగిల్ ఎప్పుడు వస్తుందన్న దానిపై అభిమానుల మధ్య పెద్ద చర్చ జరుగుతోంది. దీనిపై చివరికి నిర్మాత ఎస్‌కేఎన్ స్పందించి క్లారిటీ ఇచ్చారు. ఎస్‌కేఎన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఫస్ట్ సింగిల్ విడుదలలో ఆలస్యం రావడానికి కారణం ఉత్తర భారత, తెలుగు మార్కెటింగ్ టీమ్‌ల మధ్య చర్చలు అని చెప్పారు. మొదటగా 'రెబెల్ సాబ్' అనే ఎనర్జిటిక్ సాంగ్‌ను ముందుగా విడుదల చేయాలని అనుకున్నా, ఉత్తర భారత పంపిణీ దారులు మాత్రం ముందుగా మెలోడి సాంగ్ రిలీజ్ చేయాలని సూచించారని తెలిపారు. ఈ భిన్నాభిప్రాయాల వల్లే చిన్న ఆలస్యం జరిగిందని అన్నారు. దక్షిణ భారత మార్కెట్లో సాధారణంగా లిరికల్ వీడియోలు మాత్రమే రిలీజ్ చేసి, పూర్తి సాంగ్ వీడియోలను థియేటర్స్‌లో చూపిస్తారని, కానీ ఉత్తర భారత మార్కెట్లో మాత్రం పూర్తి వీడియో సాంగ్స్ ముందుగానే విడుదల చేస్తారని ఎస్‌కేఎన్ వివరించారు. ఇందుకే ఆలస్యం జరిగుతుందని తెలియజేశారు. 'ది రాజా సాబ్'లో ఐటెమ్ సాంగ్ ఉండదని, అయితే ఒక పాపులర్ హిందీ సాంగ్‌ను రీమిక్స్ వెర్షన్‌గా తీస్తున్నామని నిర్మాత తెలిపారు. ప్రతి సాంగ్ రిలీజ్ మధ్య 10-14 రోజుల గ్యాప్ ఇస్తారని, ఇలా చేయడం వల్ల ప్రేక్షకులు ప్రతి సాంగ్‌ను మంచి మ్యూజిక్ అనుభవంతో ఆస్వాదించగలరని చెప్పారు. ఎస్‌కేఎన్ ప్రకారం, ఫస్ట్ సింగిల్ నవంబర్ మూడో లేదా నాలుగో వారంలో విడుదల కానుంది. ఆ తర్వాత సినిమా ప్రమోషన్లు డిసెంబర్ చివరి వరకు కొనసాగుతాయి. ఈ క్రమంలో 'ది రాజా సాబ్' నువచ్చే జనవరి 9న, సంక్రాంతి సీజన్‌లో గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి టీమ్ సన్నాహాలు చేస్తోంది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మొత్తానికి, 'ది రాజా సాబ్' ఫస్ట్ సింగిల్‌పై ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. నిర్మాత ఎస్‌కేఎన్ ఇచ్చిన తాజా అప్‌డేట్‌తో అభిమానులు ఊరట చెందారు. మెలోడి సాంగ్ రూపంలో రాబోయే ఈ ఫస్ట్ సింగిల్, ప్రభాస్ మ్యూజిక్ జర్నీకి కొత్త ఛాప్టర్‌గా నిలిచే అవకాశముంది.




# యువ హీరో శర్వానంద్ తాజా చిత్రం బైకర్

అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ నటిస్తున్న చిత్రం బైకర్. ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మీరు బైకర్ స్పీడ్ ఎలా ఉందో చూశారు. ఇక ఇప్పుడు ప్రెప్పీ మెలోడీ టైం వచ్చేసిందంటూ.. ఫస్ట్ సింగిల్ ప్రోమో అప్‌డేట్ లుక్ విడుదల చేశారు. హెల్మెట్ పెట్టుకున్న హీరోయిన్‌తో రొమాంటిక్ మూడ్‌లో ఉన్న శర్వానంద్ స్టిల్ సాంగ్‌పై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ పాట ప్రోమోను నవంబర్ 11న లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు. గిబ్రాన్ మ్యాజికల్ ఆల్బమ్‌ను రెడీ చేస్తున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్.. ఇక్కడ ప్రతీ బైకర్‌కు ఓ కథ ఉంటుంది. సమయంతో పోరాడే కథ.. చావుకు ఎదురెళ్లే కథ.. అంటూ సాగే వాయిస్‌తో ఓవర్‌తో మొదలైన గ్లింప్స్ బైక్ రేసుతో సాగుతుంది. ఏం జరిగినా పట్టువదలని మొండోళ్ల కథ అంటూ బైక్ రేసింగ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది. మీ హెల్మెట్లను పట్టుకోండి.. రైడ్ వైల్డ్‌గా ఉండబోతుంది.. గూస్‌బంప్స్ తెప్పించే అడ్వెంచరస్ రైడ్‌కు సిద్దంగా ఉండండి.. అంటూ శర్వానంద్ టీం ఇప్పటికే బైకర్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేస్తుంది. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో వంశీ కృష్ణారెడ్డి, ఉప్పలపాటి ప్రమోద్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. బైకర్‌లో డాక్టర్ రాజశేఖర్ శర్వానంద్ తండ్రి పాత్రలో కనిపించనుండగా బ్రహ్మాజి, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి గిబ్రాన్ సంగీతం అందిస్తున్నాడు.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154